

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :15 సంచిక: 12 హైదరాబాద్ 2016 ఏప్రిల్ పేజీలు 40

**Please visit : www.srimeherbaba.com** **వార్షిక సభ్యత్వం : రూ.100/-**

# వర్ని సెంటర్ వార్షికోత్సవము

నిజామాబాద్ జిల్లాలోని వర్ని గ్రామంలో అవతార్ మెహెర్‌బాబా సెంటర్ 13వ వార్షికోత్సవం సందర్భంగా మెహెర్‌బాబా ప్రేమిక సహవాస్ 12.06.2016 ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి శ్రీ వంకా నాగరాజు (94-41-610194) ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో హాజరుకావల్సిందిగా ఆయన కోరుతున్నారు.

# ఖమ్మం బాబా సెంటర్

## 53వ వార్షికోత్సవము

అవతార్ మెహెర్‌బాబా ఖమ్మం సెంటర్ 53వ వార్షికోత్సవము సందర్భంగా 14.05.2016 ఉదయం 7 గంటల నుండి 15.05.2016 మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేసినట్లు శ్రీ ఆర్. రామచంద్రయ్య, (9848607718) ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మెహెరాబాద్ నుండి శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరి ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. అలాగే, మాధవీలత, విశాఖపట్నం, శ్రీ టి నాగేశ్వరరావు, కాకినాడ, శ్రీ రఘుపతిరావు, బెంగళూరు, శ్రీ ఎవియన్ రవీంద్ర, శ్రీకాకుళం, తదితరులు బాబా సందేశాలపై ప్రసంగిస్తారని శ్రీ రామచంద్రయ్య తెలిపారు. బాబా ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొని అవతారుని ఆశీశ్శులు అందుకోవల్సిందిగా కోరుతున్నారు. మే 14న సాయంత్రం ఖమ్మం పురవీధుల గుండా నగర సంకీర్తన ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలకు శ్రీ ఆర్. రామచంద్రయ్య, ఛైర్మన్, ఎ.యం.బి.ఛారిటబుల్ ట్రస్టు, ఖమ్మం, ఫోన్: 9848607718 సంప్రదించగలరు.

# హెల్ప్‌లైన్

ప్రతి నెలా 25లోగా మెహెర్‌బాబా పత్రిక పోస్టులో మీకు అందేలా తగిన ఏర్పాటు చేశాం. ఐతే, ఏ కారణంగానో నెల చివరిదాకా కూడా పత్రిక పోస్టులో మీకు రాకుంటే హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ వి.ఆర్.కె.శాస్త్రి (98492 42284), శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను నెట్‌లో పంపగలము.** మెహెర్ నామ వ్యాప్తికి మీ బంధుమిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రిక వార్షిక లేక జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు.

## బాబా సందేశం

యావత్తు ప్రపంచం నన్ను అవతార పురుషుడిగా
గుర్తించక మునుపే, నన్ను ప్రేమించేవారు అదృష్టవంతులు.

**It is more important for people to come to know about Me at present, than after I manifest as the Avatar of the age.**

**- మెహెర్‌బాబా**


**గౌరవ సంపాదకులు**
మల్లాది కృష్ణానంద్
**99595-53218,**
**040-65553218**
**malladisukku@gmail.com**

*వ్యవస్థాపకులు:*
**దశిక ప్రసాదరావు**
**040-65699611**


## లోపలి పేజీలలో...


| | |
|---|---|
| 1. సంపాదకీయం | 5 |
| 2. మరాఠి సహవాస్ | 6-11 |
| 3. మా మాటలు | 12 |
| 4. గుల్మాయి | 13-19 |
| 5. లార్డ్ మెహెర్ | 20-31 |
| 6.సద్గురు కార్యసరళి | 32-33 |
| 7. చైతన్య భూమికలు | 34 |
| 8. జ్యోతిషం | 35 |
| 9. జీవిత సభ్యుల వివరాలు | 36-37 |
| 10. ప్రార్థనలు | |



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# తెలుగువారి అమెరికా పర్యటన

తెలుగువారు చాలామంది ఒక బృందంగా అమెరికాలోని మెర్టిల్‌బీచ్ తదితర బాబా సెంటర్లను సందర్శించాలని ఎంతోకాలంగా తహతహలాడుతున్నారు. ఇన్నాళ్ళకు బాబా అనుమతి లభించిందని, ఏప్రిల్ 30 నుండి ఓ 20 రోజులపాటు అమెరికాలో పర్యటించనున్న తెలుగువారి బృంద నాయకులు శ్రీ కొల్లి రామారావు అన్నారు. ఇంతకాలం వ్యక్తిగతంగా మెర్టిల్‌బీచ్ బాబా సెంటర్‌ను చాలామంది సందర్శించినా, సంఘటితంగా వెళ్తున్న తొలి తెలుగు బృందం వీరేనని చెప్పాలి. ఇక ప్రయాణ, బృంద సభ్యుల వివరాల్లోకి వెళ్తే...12 మంది తెలుగు బాబా ప్రేమిక బృందం 2016 ఏప్రిల్ 30న హైదరాబాద్ నుండి బయల్దేరి దుబాయి మీదుగా వాషింగ్‌టన్ డి.సికి మే 1న చేరుకుంటారు. అక్కడి నుండి వారు అమెరికాలో వున్న బాబా సెంటర్‌లలో ముఖ్యంగా మెరిటిల్ బీచ్‌తోపాటు, వాషింగ్‌టన్, న్యూయార్క్, లాస్‌వేగాస్, ఒక్లహోమా తదితర ప్రదేశాలలోని బాబా సెంటర్లను, పర్యటక ఆకర్షణలను సందర్శించి మే 21న తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఈ 20 రోజుల యాత్రలో తెలుగువారైన శ్రీ కొల్లి రామారావు, విజయనగరం, శ్రీ కర్రి హరికృష్ణ ప్రసాద్, శ్రీమతి కర్రి శారదా ప్రసాద్, హైదరాబాద్, శ్రీ జయం మదన్ గోపాల్, శ్రీమతి జయం లక్ష్మీ నరసమ్మ, కదిరి, శ్రీ కొనటం వెంకట రత్నం, విశాఖపట్నం, శ్రీమతి ఆకుల భాగ్యవతి, శ్రీ బిజంకి సుబ్బారావు, గుంటూరు, శ్రీ కె. సత్తయ్య, శ్రీమతి సత్తయ్య, హైదరాబాద్, శ్రీ గుడ్ల సత్యనారాయణ, శ్రీకాకుళం, శ్రీమతి జి. వరలక్ష్మి, పాల్గొంటున్నారు. వీరితోపాటు అకోలా, ఆలీఘర్, రూర్కీ, ఢిల్లీ, తదితర ప్రాంతాల నుండి బాబా ప్రేమికులు పలువురు పాల్గొంటున్నట్లు శ్రీ కొల్లి రామారావు ఒక ప్రకటనలో తెలిపారు.

# ఖాజాగూడా గుహలో అవతారుడు

హైదరాబాద్ నగర శివార్లలోని ఖాజాగూడా గుహలో అవతారుడు 1951 ఆక్టోబరులో ఏకాంతవాసం, మనోనాశ్ కార్యక్రమాన్ని నిర్వహించారని పాఠకులకు తెలుసు. నేడు ఇక్కడ ప్రతి రెండవ శనివారం ఉ. 8.30 నుండి ఉ. 10 దాకా సత్సంగ్ నిర్వహిస్తున్నారు.అలాగే, ప్రతి ఆదివారం ఉదయంపూట మొక్కలు నాటే కార్యక్రమంలాంటి పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ దఫా మీరు హైదరాబాద్‌కి వస్తే ఖాజాగూడా తప్పక సందర్శించండి. దూరప్రాంతీయులకు జూబ్లి సెంటర్‌లో బస ఏర్పాటు కూడా వుంది. మరిన్ని వివరాలకు శ్రీ పి. రాజేంద్రమెహెర్ (98-49-046848) సంప్రదించగలరు.

# సంపాదకీయం నవగ్రహ ప్రభావం

ఏ కష్టం వచ్చినా, దుఖం వచ్చినా, ఈ తరంలో చాలామంది ముందుగా దేవుడికి దణ్ణం పెట్టుకుని, దగ్గర్లోని జాతకాలు చూసే సిద్ధాంతుల్ని ఆశ్రయిస్తున్నారు. సిద్ధాంతిని భగవంతునితో సమానంగా ఆరాధించేవారూ లేకపోలేదు. అలావెళ్ళినవానికి అర్థం కాదని తెలిసి కూడా, సిద్ధాంతి గారు తనదైన శైలిలో శని ఆరింట వున్నాడనో, గురువు వక్రించాడని, అష్టమంలో రాహువు వున్నాడని చెప్పడం, అందుకు పలు పరిహార మార్గాలు సూచించడం నిత్యకృత్యంలో సర్వసాధారణమైంది. ఫలానా కష్టానికి కారణం మీ ఇంటి నిర్మాణ దోషమే ప్రధానం అని సూచిస్తారు వాస్తు నిపుణుడు. అగ్నికి ఆజ్యం తోడయినట్లు, ప్రసారమాధ్యమాలు ప్రభావం అధికంగానే వుంటోంది. ఐతే ఈ విషయంలో మెహెర్‌బాబా ప్రేమికులుగా ఒక్క నిముషం ఆలోచించాలి!! పాశ్చాత్య బాబా ప్రేమికురాలు శ్రీమతి ఐవీ డ్యూక్ తనకు జ్యోతిషంపై వున్న మక్కువతో ఫలానా వారిని కలిసానని చెబుతూ మెహెర్‌బాబాకు లేఖ రాస్తే, అందుకు బాబా తన సోదరి మణిచేత ఆమెకు జాబు రాయించారు. ఆ లేఖసారాంశం ఇలా వుంది. "**మనమంతా** బాబా చేతులలో ఉన్నాం. ప్రతీదీ బాబా ఇచ్ఛానుసారమే జరుగుతుంది. మన జాతకాలు మన జీవితాన్ని మార్చలేవు అనీ, కర్మ సంస్కారాలు బాబాయే నియంత్రిస్తారని మనం గమనించాలి. మన కర్మలను పూర్తిగా తొలగించకపోయినా, కర్మానుభవాల్ని త్వరితగతిని అనుభవింపజేసి తొలగింపజేయడంలో అవతారుడు సహకరిస్తాడని తెలుసుకోవాలి. ఎన్నో జన్మల కర్మ బంధాలు బాబాకు బాగా తెలుసు. అవతారునికి అర్పించబడిన వారు సాధారణ మానవులవలె మంత్ర తంత్రాలని ఆశ్రయించ కూడదు. కాలగతినే మార్చగలిగిన అవతారునికి అర్పించబడినప్పుడు మన కర్మబంధాలను ఆయనయే సరిచేస్తాడు. మంత్ర తంత్రాలతో మనకు పనిలేదు. వాస్తు, జ్యోతిషశాస్త్రాలంటే ఆసక్తి వుండొచ్చు. కాని, దానిలో కొట్టుకు పోరాదన్నారు".

***

కర్నాటక సంగీతానికి విశేషఖ్యాతిని తెచ్చిన ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగయ్యకు మంత్ర, జ్యోతిషాలలో కూడా విశేష ప్రతిభ వుంది. అయితే త్యాగయ్య నవగ్రహాల ప్రభావాన్ని తిరస్కరిస్తూ...తేజోమయ విగ్రహమును ధ్యానించేవారికి, నవగ్రహ బలమేమి, శ్రీరామానుగ్రహ బలమే బలం, అదే ప్రధానం అని శెలవిచ్చాడు. బాబాను అవతార పురుషునిగా విశ్వసించి, ఆశ్రయించినప్పుడు మనం దేనికీ చింతించాల్సిన పనిలేదు. అవతారునికి అత్యంత సన్నిహితులుగా ఉంటూ, వారి రక్షణలో వున్న వారు వాస్తు, జ్యోతిష శాస్త్రాలను అనుసరించడం సబబు కాదు కదా!!

# మరాఠీ సహవాస్

(గత సంచిక తరువాయి)

మొత్తంమీద ఇప్పటి దాకా 93 అంశాలపై చర్చించుకున్నాం.
మీరు నా సహవాస్‌లో, నా ఎదురుగా హాయిగా ఆనందంగా వుండండి.
ఎన్ని విషయాలు చెప్పుకున్నా చివరాఖరికి అంతా శూన్యమే కదా!!
భగవంతుడు ఒక్కడే సత్యం. నన్ను ప్రేమించండి. నా నిజమైన దర్శన భాగ్యం పొందండి.
ఈ సత్యాన్నే మీకు తెలియజేయడానికి నేను అనేక విధాల ప్రయత్నిస్తున్నాను.
అయితే ఫలితం లేకపోయింది. మీలో ఎవరు నన్ను నిజంగా ప్రేమించగలరో చూస్తాను.
ఈ విషయాలన్నింటినీ గతంలో జరిగిన గుజరాతీ, తెలుగు, హిందీ సహవాస్‌లలో
చెప్పాను. నేడు ఈ సహవాస్‌లో నా ఎదుట ఉన్న వారిలో ఎవరు నేనిచ్చే
ప్రేమ కానుకను అందుకునేందుకు ముందుకు వస్తారో చూద్దాం అన్నారు.
ఒక ఉదాహరణగా బాబా చెబుతూ, సూర్యుని కిరణాలు ప్రతి ఒక్కరి మీద సమంగా
పడతాయి. అయితే తలుపులు మూసుకుని గదిలో కూర్చున్నవారి మీద సూర్య కిరణాలు
ఎలా పడతాయి అన్నారు. మధ్యాహ్నం భోజనం ముగిశాక,
పంచ సద్గురువుల గురించి వివరిస్తానని చెప్పారు.
హజరత్ బాబాజాన్ నా నిజ స్థితిని తెలుసుకునేలాగా ఆమె ఎలా తోడ్పడిందో
ఆ తర్వాత, నేనెలాంటి స్థితిలో వున్నానో, అలాగే,
తిరిగి నన్ను సాధారణ స్థితికి ఉపాసనీ మహారాజ్ ఎలా తీసుకు వచ్చారో క్లుప్తంగా
చెప్తానన్నారు. సాకోరీ నుంచి యశ్వంత్‌రావ్, టిప్నిస్, నౌషర్వాన్ భరూచా
ఈ సహవాస్‌లో పాల్గొనడం  తనకెంతో సంతోషంగా వుందన్నారు.
సాకోరీలో ఉపాసనీ ఆశ్రమంలో వున్న గోదావరీ మాయి గురించి మాట్లాడుతూ,
ఆమెది పవిత్రమైన, స్వచ్ఛమైన హృదయం అన్నారు.
ఈ ప్రపంచంలోనే ఆమెలాంటి వారు లేరన్నారు.
పరిపూర్ణమైన, స్వచ్ఛమైన హృదయం ఆమెది" అన్నారు.
ఈ విషయంలో ఆమెకు సాటి మరొకరు లేరన్నారు.
అయినప్పటికీ భగవత్ సాక్షాత్కారం ఆమెకింకా సిద్ధించలేదన్నారు.
ఆమె హృదయ స్వచ్ఛత గురించి మాత్రమే తాను చెప్తున్నానన్నారు.
గుజరాతీ సహవాస్ సమయంలో గోదావరీమాయి మెహెరాబాద్‌కు వచ్చింది.
నాకు ఆమె, శ్రీకృష్ణుడి పెంపుడు తల్లి యశోదలాంటిదన్నారు.
ఈ ప్రాంతీయ సహవాస్‌లు పూర్తయిన పిదప కొద్దిరోజులపాటు సాకోరీ వస్తానని

చెప్పాను. అలా వచ్చినప్పుడు తనకి ఆమెనే స్వయంగా భోజనం వండి పెట్టాలని చెప్పాను. దానికి ఆమె ఎంతో సంతోషించింది.
తీరా, నేను సాకోరీ వెళ్దామంటే ఆవిడ తన కార్యక్రమంలో భాగంగా గుజరాత్ రాష్ట్రంలోని సూరత్ వెళ్ళిందని తెలిసింది. జనవరి నెలలో ఓ వారం రోజులపాటు సాకోరీలో వుండేలాగా నన్ను రమ్మనమని సాకోరీ నుండి వచ్చిన యశ్వంతరావ్ ద్వారా ఆమె ఉత్తరం పంపింది. ప్రస్తుతం ఆమె సాకోరీలో వుండనందుకు చింతిస్తున్నానని చెప్పింది. బాబా తన బిడ్డ కాబట్టి, జనవరిలో బాబా వారంరోజులపాటు సాకోరీలో వుంటే తల్లిగా సంతోషిస్తానని ఆ ఉత్తరంలో వ్రాసింది.
బిడ్డగా తల్లి మాటను గౌరవించాలని ఆమెను సంతోషపెట్టాలని కోరింది.
అయితే జనవరిలో వెళ్ళడానికి నాకు వీలు చిక్కకపోవచ్చు.
దేశంలోని పలుచోట్ల వున్న పలువురికి ముఖ్యంగా స్త్రీలకు ప్రత్యేక సహవాస్ ఇస్తానని నేను ఇప్పటికే వాగ్దానం చేశాను. అయితే గోదావరీమాయి వ్రాసిన ఉత్తరం ఈ విషయంలో నన్ను మరోమారు ఆలోచింపజేస్తుంది.
ఇప్పుడు నేను మహిళా ప్రేమికుల సహవాస్‌కు హాజరు కావాలా,
లేదా తల్లి యశోద సహవాస్‌కి వెళ్ళాలా? అన్న మీమాంశలో పడ్డాను.
గోదావరి మాయి మరాఠి భాషలో వ్రాసిన లేఖని
సహవాసీలకి అర్థమయ్యేలాగా మండలి సభ్యుడైన విష్ణుని చదవమన్నారు.
ఆ తర్వాత తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ గోదావరిమాయిలాంటి హృదయం
ఈ ప్రపంచంలోనే ఎక్కడా లేదని నేను ఎలా చెప్పాను అని ప్రశ్నిస్తూ,
ఆమెలో కించిత్ గర్వం లేదని, **"నేను అనే ఆహంకారమే"** లేని స్వచ్ఛమైన హృదయమని బాబా అన్నారు. ఇసుమంత అహకారం లేకుండా వుండటం ఆషామాషీ విషయం కాదన్నారు. అదేదో తనకే అర్థమౌతుందన్నారు.
తల నుండి పాదాల వరకు ఆమె ప్రేమ నిండిన మహా సాధ్వి అన్నారు.
ఇందులో ఏ మాత్రం అతిశయోక్తి లేదన్నారు.
ఉపాసనీ మహారాజ్ గొప్ప సద్గురువు.
ఆయనకు గోదావరీమాయితో గల గత జన్మల అనుబంధం గురించి తెలుసు.
నేను ఒక ఏడాది పాటు ఏకాంతవాసంలోకి వెళ్ళాలనుకుంటున్నాను.
ఆ సమయంలో నన్ను దర్శించుకునేందుకు వీలుండదు.
కాబట్టి నేను సాకోరీ వెళ్ళాలా, మహిళా ప్రేమికుల సహవాస్‌కి హాజరుకావాలా అన్న ఆలోచనలో వున్నానన్నారు. యశ్వంతరావ్‌ను ఉద్దేశించి బాబా మాట్లాడుతూ గోదావరీ మాయి సూరత్ నుంచి తిరిగి వచ్చాక నేను సాకోరీ వచ్చి రెండురోజులు వుంటానని చెప్పమన్నారు. నేను ఎప్పుడు వచ్చేది తర్వాత తెలియజేస్తానన్నారు.

ఆమె స్వయంగా వండితే, ఆమె చేతి వంట తినాలని వుందన్నారు.
బాబాని నాగపూర్‌కు ఆహ్వానించాలని డాక్టర్ సిడి దేశ్‌ముఖ్ ఉవ్విళూరుతున్నాడు. నాగపూర్ ఆయన స్వగ్రామం. నాగపూర్‌లో మహిళా సహవాస్ నిర్వహించాలన్నది దేశ్‌ముఖ్ ఆలోచన. గత నెలరోజుల నుంచి సి.డి. దేశ్‌ముఖ్ మెహెరాబాద్‌లోనే వుంటున్నాడు కాబట్టి ఇక్కడ జరుగుతున్న విషయాలన్నీ ఆయనకి తెలుసు.
సహవాసీలని ఉద్దేశించి బాబా మాట్లాడుతూ అనాదిగా వాగ్దానాలు చేయడం, ఆ వాగ్దానాలను భంగపరచడం తనకు అలవాటేనని అన్నారు.
వాగ్దానాలు చేసి వాటిని మర్చిపోతుంటాను.
అయినప్పటికీ ఇంతవరకు తానిచ్చిన హామీలను ఏ ఒక్కదాన్నీ వమ్ము చేయలేదన్నారు. కాబట్టి, నాగపూర్‌లో ఏర్పాటు చేయాలనుకున్న మహిళా సహవాస్‌కు ప్రత్యేక తేదీలు అప్పుడే నిర్ణయించొద్దని అన్నారు. గత నెల రోజుల నుంచి సి.డి. దేశ్‌ముఖ్, నాగపూర్ సహవాస్ గురించి మండలివారిని తనదైన శైలిలో బుర్రతింటున్నాడన్నారు.
నన్ను నాగపూర్‌కి ఆహ్వానించాలని, అక్కడ మహిళా సహవాస్ ఏర్పాటుతోపాటు నాగపూర్ విశ్వవిద్యాలయంలో వైస్ చాన్సలర్, ప్రొఫెసర్లను ఉద్దేశించి నేను ప్రసంగించాలని కోరుతున్నాడు. నాగపూర్ కార్యక్రమం గురించి తన ఎదుట ఆ ప్రస్తావన తిరిగి తేవద్దని దేశ్‌ముఖ్‌కి గట్టిగా చెప్పారు.
ఈ సహవాస్ అయిపోయిన తర్వాత నేను చేయాల్సిన పనులు చాలా వున్నాయి. వీలుచిక్కితే ఈ సహవాస్ అనంతరం నాగపూర్ వెళ్ళి అక్కడ కేవలం మహిళా సహవాస్‌లో మాత్రం పాల్గొనాలని వుంది.
ఆ తర్వాత ఉ. 11 గంటలకు భోజన విరామం ప్రకటించారు.
కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని ఒంటిగంటకి తిరిగి మండలిహాలులో హాజరుకమ్మన్నారు.
బాబా ప్రేమికులైన మదుసూధన్, ప్రతాప్‌ఆహిర్, పూణే భజన మండలివారి భజనలు మండలిహాలులో ఏర్పాటు చేశారు. ఈ భజనలకంటే ముందు జబల్‌పూర్ నుండి వచ్చిన **బాబా ప్రేమికుడైన సులూ మెశ్రాం** బాబా ఎదుట ఒక పాట పాడతానని అనుమతి కోరాడు. అందుకు బాబా అంగీకరించారు. అయితే అతని గొంతు పేలవంగా వుంది. అతను పాట పాడుతున్నాడా, మాట్లాడుతున్నాడా? అన్నట్లుంది.
అది భరించలేక కొద్దిసేపట్లోనే అతని పాట ఆపమన్నారు.
నువ్వు పాడుతుంటే నేను నిద్రలోకి జారుకునేలా వుందని ఛలోక్తిగా అన్నారు.
ఇదొక అంటువ్యాధిగా సహవాసీలందరూ కూడా నిద్రలో జారుకునే అవకాశముందన్నారు. నువ్వు చక్కని పాట వ్రాశావు. నన్ను అమితంగా ప్రేమిస్తున్నావు. కానీ నువ్వు పాడుతుంటే మాత్రం మాకు నిద్ర మత్తు ఆవహించేలా వుంది.
మరోలా భావించొద్దన్నారు. నేను కన్ను మూసి నిద్రలోకి జారుకుంటే యావత్ ప్రపంచం

నిద్రపోతుందన్నారు. అనంతరం బాబాకి ఇష్టమైన గోవర్ధన్ గిరిధారి గీతాన్ని రుస్తుం కాకా అద్భుతంగా పాడి బాబాతో పాటు సహవాసీలందర్నీ ఓలలాడించాడు. అనంతరం, పూణే భజనమండలివారి భజన కీర్తనల ఆలాపన ఆరంభమైంది. మధ్యాహ్నం ఒంటి గంటకు బాబా తన గదికి వెళ్ళారు.

జగన్నాథ్ మహారాజ్ (పూణే) మరో ఇద్దరు బాబా కోసం ఆయన గదిలో ఎదురు చూస్తున్నారు. వారితో మాట్లాడి బాబా ఐదు నిముషాల తర్వాత మండలి హాలులోకి వచ్చారు. కళ్ళు తెరుచుకుని నేను చెప్పే విషయాల్ని శ్రద్ధగా ఆలకించండి.

నేను చాలా ముఖ్యమైన విషయాలను చెప్పదలచానన్నారు.

భవిష్యత్తులో ఇలాంటి అవకాశం మరెవ్వరికీ రాదు.

నేను ఈ శరీరం వదిలిపెట్టాక వందలు, వేలాది మంది ప్రజానీకం ఇక్కడకు రావచ్చు. ఈ ప్రాంతాన్ని పవిత్ర భూమిగా భావించి ఇక్కడి మట్టిని ముద్దాడితేనే జీవితం ధన్యమౌతుందని భావిస్తారు. అయితే నేను భౌతికంగా మీ అందరి సమక్షంలో ఉన్నాను. నేను చెప్పే మాటలు శ్రద్ధగా ఆలకించి లాభం పొందండి.

ఈ అవకాశం జారవిడుచుకో వద్దు. నేను చెప్పే మాటలు శ్రద్ధగా ఆలకించడానికి ప్రయత్నించండి. ఈ విధంగా ప్రతి యుగంలోనూ చెప్తున్నాను.

నా శరీరం వదిలేశాక నా కోసం ప్రాణత్యాగం చేయడానికి సిద్ధమౌతారు.

కానీ నేను భౌతికంగా మీ మధ్య వుండగా చాలా కొద్దిమంది మాత్రమే నన్ను ప్రేమిస్తారు. ఇది ప్రతి అవతార కాలంలోనూ జరుగుతోంది అన్నారు.

నేను బహిరంగ దర్శనానికి వెళ్తే, వేలాది మంది ప్రజానీకం నా దర్శనం కోసం తరలి వస్తున్నారు. దానివల్ల ప్రయోజనం ఏమీ లేదు. పెద్ద ఎత్తున వచ్చే సందర్శకులతో నాకు అవసరం లేదు. పెద్ద ఎత్తున జనాభా రావడం వల్ల నాకు ప్రత్యేకంగా గొప్పతనం ఏమీ రాదు. నన్ను ప్రేమించేవారు కొద్ది సంఖ్యలో ఉన్నా నాకదే ఇష్టం అన్నారు.

పంచ సద్గురువుల వల్లనే నేను అవతరించానని మీరు తెలుసుకోండి.

ఈ పంచ సద్గురువులు ఐదుగురూ వారి భగవదనుభవంలో ఒకటే అయినా వారి అలవాట్లు, ప్రవర్తన, ఆహార్యం తదితర విషయాలలో ఎంతో భిన్నత్వం వుంది.

ఈ సందర్భంగా నాకు గుర్తుకొచ్చిన ఒక చిన్న విషయం చెప్తాను.

చాలా సంవత్సరాల క్రితం తొలిసారిగా నేను ఓడలో ఇంగ్లాండు వెళ్ళాను.

మహాత్మాగాంధీ కూడా అదే ఓడలో ప్రయాణిస్తున్నారు.

గాంధీలాంటి వ్యక్తి మరొకరుండరు. ఆయనది పవిత్ర హృదయం.

ఆ రోజుల్లో కరాచీ మేయరు జంషెడ్ మెహతా నన్ను కలవమని గాంధీజీకి టెలిగ్రాం పంపించాడు. ఆ మేరకు ఒక రోజున గాంధీ ఓడలో నా గదికి వచ్చాడు.

ఆయనతోపాటు ఆయన కార్యదర్శి మహదేవ్ దేశాయ్ కూడా వచ్చాడు.

నాతోపాటు నా మండలి సభ్యులైన రుస్తుం, ఛాంజీలున్నారు.
తలుపు తెరవగానే గాంధీ ఒక్కడే నా గదిలోకొచ్చాడు.
కరాచీ మేయరు జంషెడ్‌జీ తనని కలవమన్నట్లు చెప్పాడు.
అందుకే వచ్చానని చెప్పాడు. నాతో ఐదు నిముషాలు మాట్లాడి వెళ్ళిపోతానన్నాడు.
అలా వచ్చిన గాంధీని కూర్చోమని చెప్పాను. ఆ రోజుల్లో నేను అక్షర ఫలకం
ఉపయోగిస్తున్నాను. ఐదు నిముషాలు మాత్రమే మాట్లాడడానికి వచ్చిన
గాంధీజీ సుమారు మూడు గంటలపాటు నాతో వున్నాడు.
గాంధీజీ తనకున్న కష్టాల గురించి చెప్పుకొచ్చాడు.
వాటికి నేను కొన్ని పరిష్కార మార్గాలు చెప్పాను. అతనెంతో సంతోషించాడు.
ఇదిలా వుంటే ప్రతి అరగంటకు ఒకసారి గది బయట వేచివున్న కార్యదర్శి
మహదేవ్ దేశాయ్ బాపూకు వున్న ఇతర పనుల గురించి గుర్తుచేయసాగాడు.
కొద్ది నిముషాలు ఆగమనేవాడు గాంధీజీ.
అలా, గాంధీజీ నా దగ్గర సంతోషంగా మూడు గంటలపాటు గడిపాడు.
ఆ తర్వాత ఆయన వెళ్ళిపోయే సమయంలో నా ఆలింగనం తీసుకున్నాడు.
ఆ మర్నాడు తిరిగి నా గదికి గాంధీజీ మరలా వచ్చాడు.
అలా వచ్చిన గాంధీజీ చాలాసేపు నాతో ముచ్చటిస్తూ కూర్చున్నాడు.
ఆ మాదిరిగా ఓడలో ప్రయాణిస్తున్న మూడు రోజులూ
గాంధీజీ వచ్చి నాతో కలిసి అనేక విషయాలు ముచ్చటించాడు.
రెండవరోజున వచ్చినప్పుడు కూడా నా అక్షర ఫలకంపై అనేక ఆధ్యాత్మిక విషయాలు
చెప్పాను. మధ్యలో గాంధీజీ కల్పించుకుని నేను మౌనం విడనాడి యావత్ ప్రపంచానికి
నా మధురమైన గొంతును వినిపించాలని కోరాడు.
మీరు చాలా గొప్పవారని, మహాపురుషులని నేను నా మనస్సులో భావిస్తున్నానన్నాడు.
తాను సాకోరీలో సద్గురు ఉపాసనీ మహారాజుని కలిసినప్పుడు తనకలాంటి భావన
కలగలేదన్నాడు. అలా ఎందువల్ల అన్నాను.
అందుకు గాంధీజీ ఇలా సమాధానం చెప్పాడు.
"ఉపాసనీ మహారాజ్‌ను సాకోరీలో దర్శించుకుందామని నేను వెళ్ళినప్పుడు
ఉపాసనీ, అర్ధనగ్నంగా కేవలం నడుం చుట్టూతా ఒక గోనె సంచిని
చుట్టుకుని వున్నాడు. ఆయన నన్ను చూస్తూనే కోపంతో
ప్రపంచంలో నువ్వు ఎంత గొప్పవాడివైనా, పేరు ప్రఖ్యాతులు వున్నా,
వాటన్నింటితో నాకేం పని అన్నాడు. నన్ను కసురుకుంటూ, దురుసుగా
దూషిస్తూ పంపివేశాడని జవాబిచ్చాడు."
గాంధీతో బాబా మాట్లాడుతూ, నీవు నిజంగా నేను గొప్పవాడిని,

మహాపురుషుడినని నీవు చిత్తశుద్ధిగా నమ్ముతున్నట్లయితే,
నేను చెప్పే ఈ మాటల్ని తప్పక నీవు నమ్మవలె అన్నాను.
ఉపాసనీ మహారాజు ఈ యుగంలో పంచ సద్గురువులలో ఒకరని స్పష్టం చేశాను.
అయితే మీరేం చెప్పినా, నామటుకు ఉపాసనీ మహారాజ్‌ని సద్గురువుగా
అంగీకరించలేనన్నాడు గాంధీ.
గాంధీలాంటి వ్యక్తి ఈ దేశంలో మరొకరు లేరని బాబా అన్నారు.
భారతదేశపు ముద్దుబిడ్డ మహాత్మాగాంధీ అని అన్నారు.
దేశం కోసం ఆయన తన సర్వస్వం అర్పించాడన్నారు.
ఆ దరిమిలా నేను ఎందుకు మౌనంగా వున్నానని,
అక్షర ఫలకం ఎందుకు వాడుతున్నానని, మౌనం విడనాడవల్సిందిగాను కోరాడు.
ఈ ప్రపంచం కోరుకునే ఆధ్యాత్మిక విషయాలను తెలియజేయమని, నన్ను
మౌనం విడనాడమని కోరాడు. మూడో రోజున తిరిగి మెహెర్‌బాబాను దర్శించుకున్న
మహాత్ముడు, నా గదిలో నాతోపాటు ఒక రోజు రాత్రి మీ సహచర్యంలో
వుండాలని వుందన్నాడు. ఆ సమయంలో నాతోపాటు వున్న రుస్తుంని,
ఇందుకు తనని వచ్చి బాబా గదికి తీసుకెళ్ళమని కోరాడు.
ఆ దరిమిలా తిరిగి వెళ్ళిపోతూ బాబా.. నీవు పురాణపురుషుడివి అన్నారు.
మీ గొప్పతనం, మీ గురించి అనేక విషయాలు చెప్పారు.
అయితే మీరు ఖాదీ దుస్తులు, ఖాదీ టోపీ ఎందుకు పెట్టుకోరు అని గాంధీ
నన్ను అడిగాడు. గాంధీజీని ప్రేమగా దగ్గరకు తీసుకుని, ఆలింగనమిచ్చి
నవ్వుతూ వీడ్కోలు పలికాను. ఆ తర్వాత బాబా కార్యదర్శి ఛాంజీ,
గాంధీజీతో పలుమార్లు కలిసి అనేక విషయాలు బాబా తరపున చర్చించాడు.
అలా కలిసిన ఒక సందర్భంలో గాంధీజీ ఛాంజీతో మాట్లాడుతూ
నేను మెహెర్‌బాబాను అనుకరిస్తున్నానన్నాడు.
ఆయనలాగానే వారంలో ఒకరోజు నేను మౌనం పాటిస్తున్నాను. ఆ రోజున
అక్షరఫలకం వినియోగిస్తున్నానని చెప్పాడు. ఈ ఓడ ప్రయాణంలో గాంధీజీ వెళ్ళిపోయిన
తర్వాత షౌకత్ ఆలీ నా దర్శనార్థం వచ్చాడు. ఆతను రుస్తుంతో నా చేతిని ముద్దాడాలని
వుందని చెప్పాడు. నేనందుకు అంగీకరించాను. అనంతరం నా కేబిన్‌లో వున్న చిన్న
కుర్చీలో కూర్చోబోతే భారీ ధృడకాయుడైన షౌకత్ దెబ్బకు ఆ కుర్చీ తునాతునకలయింది.
నేలమీద కూలబడ్డాడు. దాంతో మేం నవ్వు ఆపుకోలేక పోయాం! ఫక్కున నవ్వుకున్నాం.
అందరం కల్సి, ఆతడ్ని ఆ విరిగిన కూర్చీలో నుంచి లేపి నిలబెట్టాం.
ఇదిలా వుంటే ఇకపై పంచ సద్గురువులు, వారి రకరకాల అలవాట్లు గురించి చెప్తాను
శ్రద్ధగా ఆలకించండన్నారు. **– సశేషం.**

# పావగడ

122వ అవతార్ మెహెర్‌బాబావారి జన్మదినోత్సవాలు సందర్భంగా పావగడ గ్రామంలో 122 రోజులపాటు ప్రతిరోజు ఒక ఇంటిలో కార్యక్రమాలు జరిగినవి. ఫిబ్రవరి 21 నుండి 24 వరకు మల్లిఖార్జునరావు మూడు రోజులు బాబావారి ప్రేమ సందేశాలపై చక్కగా ప్రసంగము చేశారు. 25.02.2016 ఉ. 3.30 నుండి సంకీర్తనతో కార్యక్రమము ప్రారంభమై రాత్రి 10 వరకు జన్మదినోత్సవ వేడుకలు జరిగినవి. 25.02.2016 ఉ. 5 గంటలకు బాబావారి క్రొత్త చిత్రపటాన్ని శ్రీ రామకుమార్ (హిందూపురం) ఆవిష్కరించారు. తరువాత 15 నిముషములు మౌనం,7 మంది పిల్లలచే బాబావారి జన్మదినోత్సవ కేక్ కటింగ్, మరాఠి, కన్నడ భాషలో ప్రార్థన, హారతి జరిగినవని కార్యదర్శి శ్రీ నాగభూషణం ఒక ప్రకటనలో తెలిపారు.

# నాగభూషణం గారింట వివాహము

పావగడ, బాబా సెంటర్ కార్యదర్శి శ్రీ నాగభూషణం మరియు శ్రీమతి నాగరత్నమ్మ గారి పుత్రిక చి॥ల॥సౌ॥ సునిత వివాహం చి॥ రాఘవేంద్రతో 8.5.2016 ఆదివారం ఉ 10.45 గం.లకు పావగడలో జరుపుతున్నట్లు బాబా ప్రేమికులందరూ తప్పక హాజరుకావాలని కోరుతూ లేఖ రాశారు.

# బాలకృష్ణారావు గారింట సత్సంగ్

బాబా ప్రేమికులు శ్రీ బాలకృష్ణారావు గారు బాబాలో ఐక్యమయిన రోజుని పురస్కరించుకుని, సికింద్రాబాద్, సీతాఫల్‌మండిలో శ్రీ యం. బాలకృష్ణారావు గారి ఇంట్లో 15.04.2016న బాబావారి భజన కార్యక్రమం, సత్సంగ్ నిర్వహించారు. జంటనగరాలలోని బాబా ప్రేమికులు పెద్దఎత్తున ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# మల్కాజ్‌గిరి ఆదర్శం

హైదరాబాద్‌లోని మెహెర్‌బాబా మల్కాజ్‌గిరి సెంటర్ 2016 మార్చి 26 నుండి జూన్ 10 దాకా చలివేంద్ర కేంద్రాన్ని నిర్వహిస్తోంది. మార్చి 26న ఈ కేంద్రాన్ని లాంఛనంగా నగర కార్పోరేటర్ శ్రీ జగదీష్ గౌడ్ ప్రారంభించారు. చలివేంద్రానికి కావల్సిన మంచినీటిని మున్సిపాలిటీవారు సరఫరా చేస్తున్నారు. కాగా ప్రతి శనివారం రెండు గంటలపాటు చల్లని మజ్జిగ కూడా సరఫరా చేస్తున్నామని కేంద్ర అధ్యక్షులు శ్రీ జగన్నాధరావు తెలిపారు. గత నాలుగు సంవత్సరాలుగా చలివేంద్ర కేంద్రాన్ని నిర్వహిస్తున్న మల్కాజ్‌గిరి బాబా సెంటర్ పలువురికి ఆదర్శం అని స్థానికులు కొనియాడుతున్నారు.


గుల్మాయి..పిలమాయి

తొలితరం బాబా ప్రేమికురాలు

# గుల్మాయి

**మెహెర్‌బాబా గుల్మాయిని తన ఆధ్యాత్మిక తల్లిగా పిలిచేవారు. గుల్మాయి కుమారుడు ఆది.కె.ఇరాని మెహెర్‌బాబాకు కార్యదర్శి మరియు శిష్యునిగా ఎనలేని సేవలు అందించాడు. మెహెర్‌బాబా కోసం తమ సర్వస్వాన్ని అర్పించిన తొలితరం ప్రేమిక సభ్యులు.సద్గురు ఉపాసనీ మహారాజ్ స్వయంగా మెహెర్‌బాబా ఇచ్ఛప్రకారం నడుచుకోమని, నా యావత్తు ఆధ్యాత్మిక శక్తిని మేర్వాన్‌కు ధారపోశానని, ఇకపై మీరు మేర్వాన్‌ను అనుసరించమని చెప్పారు. మెహెర్‌బాబాను సాక్షాత్తూ ఈ యుగావతారునిగా నమ్మి, తరించిన గుల్మాయి గురించి రేఖామాత్రంగా తెలియజేసే ఈ శీర్షికను చదివి, పాఠకులు తమ అభిప్రాయాలు తెలియజేయగలరు.**

*****

అది 1919వ సంవత్సరం. మెహెర్‌బాబా తరచు సాకోరీలోని ఉపాసనీ మహారాజ్ ఆశ్రమానికి వెళ్తుండేవారు. హజ్రత్ బాబాజాన్ మాదిరి ఉపాసనీ మహారాజ్ కూడా తన ఆశ్రమానికి వచ్చే భక్తులను మెహెర్‌బాబాకు పరిచయం చేసేవారు.
ఆ రోజుల్లో మెహెర్‌బాబాను మేర్వాన్ సేఠ్ అని పిలిచేవారు.
ఉపాసనీ శిష్యుల్లో ప్రత్యేకమైన మహిళగా శ్రీమతి గుల్మాయి ఉండేది.
అప్పట్లో ఆమె వయస్సు 36 సంవత్సరాలు. ఆమెకు
చిన్నతనంలోనే ఖైఖుస్రూ సరోష్ ఇరానీతో వివాహమయింది.
ఆయన అహ్మద్‌నగర్‌లో ప్రముఖ వ్యాపారవేత్తగాను, పుర ప్రముఖుల్లో ఒకనిగా, సామాజిక సేవా నాయకుడిగా ప్రఖ్యాతి. గుల్మాయి– ఖైఖుస్రూలది ఉమ్మడి కుటుంబం.
గుల్మాయికి అత్త గారు, ఆడపడుచుల ఆరళ్ళు అధికంగానే వుండేవి.
దాంతో గుల్మాయి ఎప్పుడూ ఒకింత దు:ఖంగా వుండేది.

బాధాతప్త హృదయంతో వుండేది. మేర్వాన్ మేనమామ మాసాజీ ఖైఖుస్రూ ఇరానీ దగ్గర పనిచేస్తుండేవాడు. ఖైఖుస్రూ సోదరి పేరు గుల్నార్. గుల్నార్‌కి దీర్ఘకాలికంగా నయంకాని ఓ చర్మ సంబంధిత వ్యాధితో బాధపడుతుండేది. మాసాజీ గుల్మాయిని, గుల్నార్‌ని తమ బాధల నివారణ కోసం సాకోరీలోని ఉపాసనీ మహారాజ్‌ని, అక్కడే వుంటున్న మేర్వాన్ సేఠ్‌ని దర్శించుకోమని సలహా ఇచ్చాడు.

ఇదిలావుంటే, 1919 ఆగస్టులో గుల్మాయి సోదరి, ఆమె భర్త ఖైఖుస్రూ మాసా ముంబాయి నుండి చుట్టపు చూపుగా అహ్మద్‌నగర్‌కి వచ్చారు. వీరు శిరిడి సాయి భక్తులు. వీరు ఉపాసనీ మహారాజ్‌ను శిరిడిలోని ఖండోబా దేవాలయంలో తొలిసారిగా దర్శించుకున్నారు. ఆ తర్వాత వీరు సాకోరీలో తరచు మహారాజ్‌ని దర్శించుకునేవారు. మహారాజ్‌తోపాటు మేర్వాన్ సేఠ్‌ని కూడా దర్శించుకునేవారు.

ఈ దంపతులు తమ సోదరి గుల్మాయిని సాకోరీకి రమ్మనమని చాలాసార్లు చెప్పారు కానీ, గుల్మాయి తన వల్లకాదని, తన భర్త ఇష్టపడడని తన మనస్సులోని మాట స్పష్టంగా చెప్పింది. మనస్సులో తనకు రావాలని ఉన్నా రాలేనని చెప్పింది. దాంతో, ఖైఖుస్రూ మాసా, సూనా మాసీ మరియు గుల్నార్‌లు ఉపాసనీ మహారాజ్‌ని దర్శించుకున్నారు. గుల్నార్ తన చర్మ సంబంధ వ్యాధి గురించి మహారాజ్‌కి చెప్పి, నివారణ చూపించమని వేడుకుంది. అలాగే, గుల్మాయి యొక్క భక్తి గురించి, ఆమె కుటుంబ సమస్యల గురించి కూడా మహారాజ్‌కి చెప్పారు. అంతేకాకుండా గుల్మాయి ఎప్పుడూ ఒంటరిగా దీన వదనంతో ఉంటోందని, ఆమెకి ఏదైనా తగిన సహాయం చేయమని గుల్నార్ మహారాజ్‌ని వేడుకుంది. అందుకు ఉపాసనీ మహారాజ్ తన అభయమిచ్చాడు. భయం ఏమీ లేదన్నాడు. తన సహాయం తప్పక ఉంటుందని భరోసా ఇచ్చాడు. మీ యావత్తు కుటుంబం తన దగ్గరకొస్తారనీ అన్నాడు. నీ చర్మవ్యాధి, నీ వదిన గారి మనోవ్యథ త్వరలోనే సమసిపోతాయని మహారాజ్ భరోసా ఇచ్చాడు. మహారాజ్ వారందర్నీ ఆ రోజు రాత్రి సాకోరీలోనే బస చేయమన్నారు. అయితే, తమకు చాలా పనులున్నాయని చెప్పి ఆ రాత్రికే వారు అహ్మద్‌నగర్‌కి బయల్దేరారు. కానీ, వారు వెళ్ళేదారిలో వున్న నదికి వరదలు వచ్చి, ఆ రాత్రికి వారు నగర్ చేరలేకపోయారు. సరికదా ఆ రాత్రి ఒక గొర్రెల సావిడిలో తల దాచుకున్నారు. ఆ దరిమిలా ఇంటికెళ్ళి మహారాజ్ ఆశ్రమంలో జరిగిన విషయాలన్నీ గుల్నార్ తన వదిన గుల్మాయికి పూసగుచ్చినట్లు చెప్పింది. సద్గురు సాన్నిధ్యంలో వారు పొందిన ఆనందానుభూతిని గుల్మాయికి చెప్పింది. త్వరలో ఆమెని కూడా సాకోరీ వెళ్ళమని కోరింది. వీరు సాకోరీ నుండి తిరిగి వచ్చేటప్పుడు వీరితోపాటు గుస్తాద్‌జీ కూడా అహ్మద్‌నగర్‌కి వచ్చాడు. వీరక్కడుండగా మహారాజ్‌కు ఆరతి పట్టారు. ఆ ఆరతి పాటను మేర్వాన్ సేఠ్ రాశాడని, సంగీతం కూడా ఆయనే సమకూర్చాడని గుస్తాద్‌జీ

చెప్పాడు. మేర్వాన్ రాసిన ఆ ఆరతి పాట తమకు కావాలని గుల్నార్ కోరింది. గుల్మాయి సోదరి సూనామాసి వారు ముంబాయికి తిరిగి వెళ్ళేలోగా ఎలాగైనా గుల్మాయిని సాకోరీలోని మహారాజ్ దర్శనం ఇప్పించాలని అనేకమార్లు ప్రాధేయపడింది. ఆమె గోడు ఆలకించినట్లు, రెండువారాల తర్వాత గుల్మాయి తన సోదరి, ఆమె భర్తతో కలిసి భర్త అనుమతి తీసుకుని, సాకోరీ మహారాజ్ ఆశ్రమానికి వెళ్ళింది. చిన్న పూరి పాకలో, ముళ్ళ పొదల నడుమ, ఊరికి దూరంగా మహారాజ్ వున్నాడు. దగ్గర్లోనే వున్న ఒక రావి చెట్టు నీడలో ఇద్దరు పార్శీ యువకులు కూర్చున్నారు. ఆ ఇద్దరు యువకులు ఎవరో తెలుసా? అని ఆమె సోదరి గుల్మాయిని అడిగింది. వారిద్దరూ మహారాజ్ యొక్క భక్తులు. పూనే నివాసి షెరియార్ ముందేకర్ కుమారుడు, మేర్వాన్, ఆతని స్నేహితుడు బెహ్రంగా వారిద్దరిని పరిచయం చేశింది. షెరియార్ తన వివాహానికి వచ్చాడని గుల్మాయి అన్నది. 1896 డిశెంబర్‌లో గుల్మాయి వివాహమయింది. కొన్ని క్షణాలు ఆగితే మేర్వాన్ చాలా చక్కగా పాడతాడు. అది విని వెళదాం అని చెప్పింది. ముందుగా గుల్మాయి మహారాజ్ దర్శనార్థం ఆయన వున్న పూరి గుడిసెలో అడుగుపెట్టింది. మహారాజ్‌ని చూస్తూనే గుల్మాయి ఆశ్చర్యపడింది. ఈ మధ్యకాలంలోనే మహారాజ్‌ను పోలిన వ్యక్తిని తను కలలో చూసినట్లు ఆమె గుర్తుపట్టింది. మహారాజ్ సన్నిధిలో ఆమె ఎంతోకాలంగా ఆయన సన్నిధిలో వుంటున్నట్లు, తన చిరకాల బంధువుగా, ఆయన సమక్షంలో ఎంతో ఆనందం, లభించినట్లు ఆమె అనుభూతి చెందింది. ఈ ప్రపంచంలో ఎక్కడా లభించనంత శాంతి, ఆనందం మీ ఆశ్రమంలో వున్నాయని గుల్మాయి మహారాజ్‌తో అన్నది. ఈ సమయంలో మేర్వాన్ ఆశ్రమం బయట సదాశివపాటిల్‌తో కల్సి నిలుచుని వున్నాడు. మహారాజ్ దగ్గర వీడ్కోలు తీసుకుని బయటకు వచ్చిన గుల్మాయికి మేర్వాన్ కనిపించాడు. ఎలాగున్నారని మేర్వాన్ ఆమెను పలుకరించాడు. ఆమె ఎంత చక్కగా మాట్లాడుతోంది కదా అని ప్రక్కనే వున్న సదాశివపాటిల్‌తో మేర్వాన్ అన్నాడు. అంతేకాదు, ఆమె నా తల్లి అయితే ఎంత బాగుండేదన్నాడు. ఈ మాటలతో మేర్వాన్ సేఠ్ ఆమె హృదయాన్ని దోచుకున్నాడు. ఆ రోజు సాయంత్రమే గుల్మాయి అహ్మద్‌నగర్‌కి తిరిగి వెళ్ళిపోయింది . ఆ దరిమిలా గుల్మాయి తరచు తీరిక చిక్కినప్పుడల్లా సాకోరీ ఆశ్రమానికి వచ్చిపోతోంది. మహారాజ్ ఆశ్రమంలో కొన్నాళ్ళపాటు ఉండాలన్నది ఆమె కోరిక. మహారాజ్ ఆశ్రమం సందర్శించినప్పుడల్లా మేర్వాన్ సేఠ్‌ను కూడా గుల్మాయి కలుసుకునేది. మేర్వాన్ కూడా తన ఆధ్యాత్మిక అనుభూతులను ఆమెతో పంచుకునేవాడు. మేర్వాన్ ఎప్పటికయినా మహారాజ్‌కు ఆధ్యాత్మిక వారసుడవుతాడని ఆమె అనుకునేది. ఒకసారి గుల్మాయి మహారాజ్ ఆశ్రమంలో 12 రోజులు వున్నది. ఈ సమయంలోనే గుల్మాయిని మహారాజ్ కోపంతో చెంపదెబ్బ కొట్టారు. ఈ సంఘటన

గురించి మేర్వాన్ వివరిస్తూ గుల్మాయి చాలా అదృష్టవంతురాలని అన్నారు. సద్గురు మహారాజ్ కృపను పొందిన తొలి మహిళ గుల్మాయి అని మేర్వాన్ ఆమెకు కితాబిచ్చాడు. సద్గురువు ఎవరినైనా, ఎప్పుడైనా కొడితే అది ఎంతో అదృష్టంగా భావించాలన్నాడు. బాబాజాన్ కూడా కట్టె తీసుకొని తనకిష్టమైనవారిని కొట్టేదని గుర్తుచేశాడు. గుల్మాయి సాకోరీని వదిలి వెళ్ళేముందు ఉపాసనీ ఇలా అన్నారు. ప్రజలు సాధారణంగా అందమైన పెద్ద దేవాలయాలను సందర్శించడానికి ఇష్టపడతారు. నగరంలో పెద్దలు, ధనవంతులు కూడా అలాంటి దేవాలయాలకే వెళ్ళాలనుకుంటారు. సాకోరీలాంటి శుద్ధ పల్లెటూరుకు, బీడు భూమికి, ప్రేమ, భక్తి, గురువుపై ఆరాధన గలవారే వస్తారని గుల్మాయిని ఉద్దేశించి మహారాజ్ మెచ్చుకోలుగా అన్నారు. ఉద్వాడాలో ఏముంది? అని మహారాజ్ ప్రశ్నించారు. ఉద్వాడాలో అగ్ని దేవాలయం వుంది. సాకోరీలో భగభగలాడే జీవమున్న అగ్ని ఉందని మహారాజ్ అన్నారు. సద్గురువు పాదాలచెంతనే నిజమైన పుణ్యక్షేత్రం వుంటుందన్నాడాయన.

సాకోరీలో మహారాజ్ కోసం 1919 ప్రాంతంలోనే ఒక చిన్న దేవాలయం నిర్మించడానికి మేర్వాన్ స్వయంగా పూనుకున్నాడు. ఆ ఖర్చు అంతా మేర్వానే భరించాడు. ఇదే సాకోరీలో నిర్మించిన తొలి దేవాలయం. ఆ తర్వాత కాలంలో మహారాజ్ పేరు ప్రఖ్యాతులు నలుదిశలా వ్యాప్తిచెందాక సాకోరీలో పలు ఇతర దేవాలయాలు నిర్మించారు. ఆ తర్వాతర్వాత గుల్మాయికి, ఆమె కుటుంబసభ్యులందరికీ, మేర్వాన్ ఎడల ప్రేమానురాగాలు క్రమేణా అధికమౌతాయి.

1919 నాటికి గుల్మాయి వయస్సు 36. ఆమె భర్త ఖైఖుస్రూ (42), ఇద్దరు కుమారులు, రుస్తుం (20), అదీ (16), ఇద్దరు కుమార్తెలు పిరోజా (14), డాలీ (7).

గుల్మాయి రెండవ కుమారుడు అదీ మెహెర్‌బాబా తొలిసారిగా 1919 డిశెంబర్ 27న సాకోరీలో మెహెర్‌బాబాను దర్శించుకున్నాడు. తన తల్లికి తోడుగా సాకోరీ వచ్చాడు. అప్పట్లో అదీ పంచఘనిలోని పార్శీ బోర్డింగ్ స్కూల్‌లో చదువుకుంటున్నాడు. అదీ మహారాజ్‌ని చూస్తూనే ఆయనకు పాదాభివందనం చేశాడు.

ఆ సమయంలో మహారాజ్ ఏమన్నారో తెలుసా...

నా యావత్తు ఆధ్యాత్మిక శక్తిని మేర్వాన్‌కు ధారపోశాను. ఇకపై నీవు మేర్వాన్‌ను అనుసరించు. కష్టాలలో, సుఖాలలో ఆతనిని వదిలిపెట్టకు. మేర్వాన్‌ని అన్నివేళాలా n q Td ÿ + # ã n " n H •s Á. **ప్రస్తుతం నేను ఖాళీ కుండను అన్నారు.**

1920 డిశెంబర్‌లో మేర్వాన్ గుల్మాయిని తనతోపాటు నాసిక్‌కు రమ్మనమని అడిగారు. అందుకు ఆమె సరేనంది. దాదాపుగా ఈ సమయంలోనే గుల్మాయి భర్త ఖైఖుస్రూకు ఖాన్ సాహెబ్ అనే బ్రిటీషు ప్రభుత్వం ఇచ్చే గౌరవ బిరుదు లభిస్తుందని బాబా జోస్యం చెప్పారు. ఖైఖుస్రూ ఈ విషయానికి పెద్ద ప్రాధాన్యత ఇవ్వలేదు. నమ్మలేదు కూడా.

బాబా జోక్ చేస్తున్నారులే అనుకున్నాడు. బాబా ఈ విషయాన్ని గట్టిగా చెప్పినా ఆయన పెద్దగా పట్టించుకోలేదు. కానీ, ఏడాది తిరగకమునుపే బ్రిటీషు ప్రభుత్వం మెహెరుడు ప్రకటించిన గౌరవ సత్కారాన్ని ఖైఖుస్రూకి అందజేసింది.
ప్రతి సద్గురువుకు కన్న తల్లితోపాటు ఒక ఆధ్యాత్మిక తల్లి ఉంటుంది. ఉపాసనీ మహారాజ్‌కు దుర్గాబాయి ఆధ్యాత్మిక తల్లిగా వుంది. అదేమాదిరిగా నారాయణ మహారాజ్, తాజుద్దీన్ బాబాలకు కూడా ఆధ్యాత్మిక తల్లి వుంది. సద్గురువులకు ఆధ్యాత్మిక తల్లితోపాటు ఆధ్యాత్మిక సోదరికూడా ఒకొరుంటారని బాబా అన్నారు. గుల్మాయి నాకు ఆధ్యాత్మిక తల్లి అని, పిలమాయి నాకు ఆధ్యాత్మిక సోదరి అని బాబా ప్రకటించారు. మీ ఇద్దరితో నాకు అనేక జన్మల నుండి బంధం వుందన్నారు. మీరెంతో అదృష్టవంతులన్నారు. దీనికి జవాబుగా ఆధ్యాత్మిక విషయాలు నాకేమీ తెలియవు. నేను నీ పాద ధూళితో సమానమో కాదో కూడా నాకు తెలియదు అని గుల్మాయి వినమ్రంగా జవాబిచ్చింది. జీవితంతో నేను అలసిపోయాను. నేనొక సాధారణ స్త్రీని. నాకున్నది ఒకేఒక్క కోరిక. మహారాజ్ ఆశ్రమంలో వుంటూ వారి సేవ చేసుకుంటూ తనువు చాలించాలన్నదే తన కోరిక అని గుల్మాయి జవాబిచ్చింది. దీంతో బాబా ఆమెకేసి తీక్షణంగా చూసి నేను, మహారాజ్ వేరు కాదు. మా దేహాలు వేరైనా మేమిద్దరం ఒక్కటే. నేను ఆయన కుమారుడను. నేను చెప్పినట్లు చేయమని గుల్మాయిని తీవ్ర స్వరంతో బాబా ఆదేశించారు. అంతక్రితమే బాబా ఏమి చెబితే అది ఆలకించమని, అతని ఇష్టప్రకారమే నడుచుకోమని ఉపాసనీ గుల్మాయికి హెచ్చరించడంతో ఆమె మారు మాట్లాడలేదు. మౌనంగా నిల్చుండిపోయింది. ఆ తర్వాత బాబా మాట్లాడుతూ, మీ కుటుంబ సభ్యులందరూ నాకు చాలా ఇష్టమైనవారని అన్నారు. భవిష్యత్తులో మీరు నాకు మరింత దగ్గరౌతారని అన్నారు. యావత్ ప్రపంచం నాకు ఎదురుతిరిగినా, నీవు, నీ కుటుంబ సభ్యులెవరూ నన్నొదిలి ఎక్కడికీ వెళ్ళరని బాబా అన్నారు. 1921 ప్రాంతంలో గుల్మాయి కుటుంబసభ్యులు **సరోష్ మంజిల్** పేరిట ఒక సొంత ఇంటిని అహ్మద్‌నగర్‌లో నిర్మించుకున్నారు. నూతన గృహప్రవేశానికి ఉపాసనీ మహారాజ్‌ని ఆహ్వానించారు. అయితే హిందూ గురువును గృహ ప్రవేశానికి ఆహ్వానించడం వారి బంధువులకు సమ్మతం కాదు. అంచేత, జొరాస్ట్రియన్ మతాచారాల ప్రకారం గృహప్రవేశం జరిగింది. స్థానికంగా వున్న మహ్మదీయ సన్యాసి గిలోరీ షాను ఆహ్వానించారు. పేదలకు అన్నదానం జరిపారు. వారి పాత ఇంటి నుండి సమాన్లంతా సరోష్ మంజిల్‌కు తరలించారు. అయినా కూడా, తన గురువు ఉపాసనీ మహారాజ్ సాదరంగా గృహప్రవేశం చేయకుండా తాను ఆ ఇంట అడుగుపెట్టనని గుల్మాయి భీష్మించింది. ఆ దరిమిలా..ఆదీ, రుస్తుంలు మహారాజ్‌ను కారులో సాకోరీ నుండి తీసుకొచ్చారు. ఆయనకు మెడలో పూలదండ వేసి, నారికేళాలు సమర్పించి ఇంట్లోకి లాంఛనంగా ఆహ్వానించారు.

గుల్మాయి, వారి బంధువర్గమంతా మహారాజ్ దర్శనం చేసుకున్నారు. అయితే, గుల్మాయి భర్త తరఫువారందరూ దీన్ని పూర్తిగా వ్యతిరేకించారు. గుల్మాయి ఈ విషయాన్ని పట్టించుకో లేదు. తాననుకున్నట్లు మహారాజ్ చేత నూతన గృహప్రవేశం ఘనంగా జరిపించింది. ఇదిలావుంటే బాబా పూణేలో వుండే సమయంలో గుల్మాయి, రుస్తుంలను పూణేకు రమ్మని పిలిపించారు. రుస్తుంకు సరైన జోడిని చూసి వివాహం జరిపించమని గుల్మాయికి చెప్పారు. తగిన వధువు కోసం గుల్మాయి అన్వేషణ ప్రారంభించింది. ఇంతలో గుల్మాయి రెండవ కుమారుడు–ఆదీ, ఫ్రీనీ అనే అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. ఆ అమ్మాయి కూడా ఆదీని అమితంగా ప్రేమించింది. పెళ్ళంటూ చేసుకుంటే ఆదీతోనేనని ఫ్రీనీ నిర్ణయించుకుంది. ఈ విషయాన్ని గుల్మాయి బాబా చెవినవేసింది. బాబా ఫ్రీనీని –ఆమె తల్లిని, గుల్మాయి– ఆదీలను పూణేలో తన వద్దకు పిలిపించారు. ఫ్రీనీని మరచిపోమ్మనమని బాబా ఆదీని హెచ్చరించారు. ఫ్రీనీతో కూడా బాబా ఇదే విషయం చెప్పారు. ఆదీ తనకు చెందినవాడని బాబా అన్నారు. ఆదీ తల్లికి కూడా ఆతనిపై ఎలాంటి అధికారం లేదని బాబా ప్రకటించారు. ఆదీతో వివాహమైతే నీవు సుఖపడవలేవని చెప్పారు. ఆతనితో నీకెలాంటి ఆనందం ఉండదన్నారు. నీకు త్వరలో ఒక ధనవంతునితో పెళ్ళి నిశ్చయమౌతుందని, ఆతనితో నీవు సంతోషంగా వుంటావని బాబా అన్నారు. ఫ్రీనీ వెక్కి వెక్కి ఏడ్చింది. కానీ, బాబా నిర్ణయానికి కట్టుబడి ఉంటానంది. ఫ్రీనీ తల్లి నాజాతో గుల్మాయి మాట్లాడుతూ, మెహెర్‌బాబాతో తమ సమస్యలు మనస్సులో ఉన్నది ఉన్నట్లుగా చెప్పుకోమంది. రెండు విషయాలు బాబాతో చెప్పాలని ఉందన్నది నాజా. నాకు సరైన జవాబు లభిస్తే బాబాని భగవంతునిగా అంగీకరించడమే కాదు, ఆయన ఆశ్రమాన్ని చీపురుతో శుభ్రం చేస్తానంది.

**నాజా ఇరానీ** గొప్ప ధనవంతురాలు. అలాంటి వ్యక్తి చీపురు పట్టడం అంత తేలికైన విషయం కాదు. 1.తాను త్వరలో ఇరాన్ దేశానికి వెళ్ళి, అక్కడ జొరాష్ట్రియన్ మతాచారాల ప్రకారం పూజలు నిర్వహించవల్సి వుందని చెప్పింది. 2. తన కుమార్తె ఫ్రీనీ వివాహం జరపాలని కోరుకుంటున్నానంది. ఈ రెండు కోర్కెలు నెరవేరితే ముందుగా గుల్మాయితో చెప్పినట్లు బాబావారి ఆశ్రమంలో సేవ చేసుకుంటానని చెప్పింది. ఈ మాటలు విని బాబా నవ్వుతూ, నీ రెండు కోర్కెలు తప్పక నెరవేరతాయని అభయమిచ్చారు. అయితే నీ కోర్కెలు ఫలించాక నీవు చెప్పినట్లు నా ఆశ్రమానికి రావడం, నాకు సేవ చేయడం మాత్రం మర్చిపోవద్దన్నారు. రుస్తుం వివాహం నిశ్చయమయింది. బాబా బృందం ఆ పెళ్ళికి వచ్చారు. ఖాన్ సాహెబ్, గుల్మాయిలకు చెందిన ఖుస్రూ క్వార్టర్స్‌లో బాబా బస చేశారు. గుల్మాయి కుటుంబ సభ్యులకు వారి మేనల్లుడు సరోష్‌కు తప్ప స్థానికంగా వున్న జొరాష్ట్రియన్ కుటుంబాలవారెవ్వరికీ మెహెర్‌బాబా అంటే గౌరవం, నమ్మకం లేదు. ఆయనొక ఆధ్యాత్మిక గురువుగా కూడా వారు భావించేవారు కాదు.

గుల్మాయి అత్తవారింట అందరూ ఈ విశాలమైన ఖుస్రూ క్వార్టర్స్‌లోనే వుంటున్నారు. మెహెర్‌బాబాపట్ల గుల్మాయికి గల భక్తి ప్రపత్తులను చూసి వీరు తరచు ఎకసెక్కం చేసేవారు. అయినా కూడా గుల్మాయి కుటుంబసభ్యులకు బాబా ఎడల గల భక్తి, గౌరవాలు ఏమాత్రం చెక్కు చెదరలేదు సరికదా, వారి బంధువుల సూటిపోటి మాటలను పట్టించుకునేవారే కాదు. ఇది మెహెరుడు వారియెడల చూపిన కృపకు నిదర్శనం. రుస్తుం పెళ్ళయిన తర్వాత, అహ్మద్‌నగర్‌కి దగ్గర్లోని ఆరంగామ్‌కు బాబా బృందం వెళ్ళాలని నిర్ణయించింది. ఆరంగాం గ్రామంలో గుల్మాయి ఖైఖుస్రూలకు చెందిన స్థలాన్ని మెహెర్‌బాబా ఆశ్రమ స్థాపనకు అనువుగా వుంటుందని వారు భావించారు. ఈ స్థల విషయంలో కూడా కొంత అలజడి చెలరేగింది. ఖాన్ సాహెబ్ ఆస్తిని మెహెర్‌బాబా కాజేస్తున్నాడని గుల్మాయి అత్తారింటివారు అలజడి రేపారు. ఈ విషయం తెలుసుకున్న మెహెర్‌బాబా ఖుస్రూ క్వార్టర్స్‌లోని తన గది వదిలి బయటకు వచ్చేశారు. ఆరంగామ్‌లో మెహెర్‌బాబా ఆశ్రమం ఏర్పాటు చేయవల్సిందిగా గుల్మాయియే ప్రత్యేకంగా మెహెర్‌బాబాని ఆహ్వానించింది. కానీ తన బంధువులు వ్యతిరేకించడంతో ఆమె చాలా బాధపడింది. ఖాన్ సాహెబ్ తన భార్యకు బాబా ఎడల గల భక్తికి ముగ్ధుడై తమ కుటుంబ సభ్యులందరి తరఫున క్షమించమని కోరుతున్నానని వేడుకున్నాడు. తమ ప్రార్ధన ఆలకించి ఆరంగామ్‌లోనే ఆశ్రమ స్థాపనకు అంగీకరించమని ప్రాధేయపడ్డాడు. ఒక ఫకీరుకు ఇల్లు వాకిలితో పనేమి, అదే సమయంలో అతనికి లేనిదీ ఏమీ లేదు అని బాబా అన్నారు. నేను ఆరంగామ్‌లో ఉండి మీ కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు సృష్టించదలచ లేదు అన్నారు. అనంతరం మరెన్నోమార్లు గుల్మాయి, ఖుస్రూలు అవతారుడ్ని మనసారా వేడుకోగా 1923 మే 13న బాబా ఆరంగామ్ చేరారు. అక్కడున్న పాడుబడిన పోస్టాఫీసులో ఆ రోజు బస చేశారు. ఒక సందర్భంలో బాబా మాట్లాడుతూ నేను చేసే పని గురించి మీకేమీ తెలియదు, నా పని విధానం మీకు అర్ధం కాదు. ఎలక్ట్రిక్ స్విచ్ మీద తన చేతిని వుంచి గుల్మాయితో ఇలా అన్నారు. ఈ స్విచ్ నుండి బల్బుకు విద్యుత్ వైరు కనెక్షన్ వుంది. నేను ఈ స్విచ్ నొక్కగానే బల్బు వెలుగుతుంది. అదేవిధంగా సద్గురువు సన్నిధానంలోకి వచ్చిన ఆధ్యాత్మిక తల్లికి, స్విచ్ నొక్కగా విద్యుత్ బల్బు వెలిగినట్లు తగిన సమయంలో ఆధ్యాత్మిక ప్రగతి లభిస్తుందని, ఆ సమయం కోసం ఓపిక పట్టాలన్నారు. నిరంతరం బాబా సేవలో, నామస్మరణలో గడిపిన గుల్మాయి ఆమె కుటుంబ సభ్యులందరూ ధన్యులు. గుల్మాయి రెండవ కుమారుడు ఆదీ.కె.ఇరానీ మెహెర్‌బాబాకు కార్యదర్శిగా, శిష్యునిగా తన జీవితం అకింతమిచ్చారు. నేడు మెహెరాబాద్‌లోని బాబా సమాధి ప్రాంగణం, దిగువ మెహెరాబాద్‌లోని బాబా మండలి హాలు మరి ఇతర ప్రాంగణమంతా గుల్మాయి-ఖైఖుస్రూలు మెహెర్‌బాబాకు 1923 ప్రాంతంలో అందజేశారు. ❋



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

**ఆంగ్ల మూలం: - భావూ కల్చురీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - *తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ***

(గత సంచిక తరువాయి)

సావక్ కొత్వాల్ భార్య వచ్చింది ఓ రోజు. ఆమె పేరు నర్గిస్.
బాబావారంటే ఇష్టమూ లేదు, అయిష్టమూ లేదు.
కానీ బాబావారిని దర్శించిన తర్వాత భర్తలో వచ్చిన మార్పుతో ఒళ్ళు మండిపోతోంది.
సావక్ ఏం చేశాడు, నర్గిస్‌కి కోపం రావటానికి అంటారా
అతనికి గెడ్డపువాళ్ళంటే పిచ్చి పట్టింది.
బాబావారిని ఏ ముహూర్తంలో దర్శించాడో కానీ అప్పటి నుంచి గెడ్డాలు పెంచుకొని కాషాయ బట్టలు వేసుకొన్నవాళ్ళు కనిపిస్తే చాలు ఎగిరి గెంతేస్తున్నాడు.
ఫలాన సాధువు ఫలాన ఊళ్ళో ఉన్నాడని చెప్తే చాలు,
ఆ ఊరికి పరుగెడుతున్నాడు. ఆ సాధు పురుషుని దర్శనం చేసుకొని
నా జన్మ ధన్యమయిందనుకొంటున్నాడు. ఇలా సాధువుల వెంట భర్త పరుగెడుతుంటే ఏ భార్యకయినా కోపం రావటం సహజం. మరి నర్గిస్‌కీ కోపం వస్తోంది.
ఈ సాధువుల పిచ్చిలో పడి నన్ను మరచిపోతున్నాడని కుతకుత వుడికి పోతోంది.
నా భర్త ఇలా మారటానికి ఈ మెహెర్‌బాబాయే కారణమనుకొంది.
"బహుశా చెప్పి వుంటాడు, మెహెర్‌బాబా, పెళ్ళాం పిల్లల్ని పట్టించుకోవద్దని,
అందుకే మా ఆయన ఇలా మారిపోయాడనుకొంది.
బాబావారిని చూస్తూనే అగ్గి మీద గుగ్గిలమయింది.
నువ్వేనా మెహెర్‌బాబా అంటే అని గట్టిగా కోపంగా అడిగింది.
మెహెరుడు తల ఊపాడు. చిరునవ్వు నవ్వాడు. అంతే తన గోడు చెప్పుకొంది.
నా భర్త నన్ను పట్టించుకోవటం లేదు, నిన్ను దర్శించినప్పటి నుంచి అని వాపోయింది.
ఇదేమి భక్తి బాబా నా భర్తకి? అని అడిగింది?
నీ భక్తులు ఇలాగే వుండాలా? ఇదేనా నీ కోరిక అని నిలదీసింది.
మెహెరీశుడి చిరునవ్వు చెదర లేదు. నర్గిస్ మనోవేదన శాంతంగా విన్నాడు.
నీకెందుకు చింత? ధైర్యంగా వుండు. నువ్వు సావక్‌ని వదిలేస్తే వదిలేస్తావేమో కానీ సావక్ నిన్నెప్పుడూ వదలడు. నిన్నే అంటిపెట్టుకొని వుంటాడు అని శెలవిచ్చాడు.

బాబావారి మాటలు నర్గిస్‌కి టానిక్‌లా పనిచేశాయి. మనిషిలో కొత్త స్థయిర్యం వచ్చింది.
హమ్మయ్య! నాకేమీ కాదన్నమాట, మా ఆయన మారలేదన్నమాట అనుకొంది.
నీ ఆంతర్యం నాకు తెలియదా అంటున్నట్లు బాబావారు అక్షర ఫలకంపై
మరిన్ని స్వాంతన వాక్యాలు పలికారు. “నేను మిమ్మల్ని విడదీయడానికి రాలేదు.
మిమ్మల్ని కలపడానికి వచ్చాను” అన్నారు. నర్గిస్‌కి ఇంతకంటే ఇంకేమికావాలి.
ఆనందంతో ఉబ్బితబ్బిబ్బు అయ్యింది. నువ్వు సావక్‌ని వదిలేసినా నిన్నెప్పుడూ వదలడు
అతగాడు అని బాబావారు అన్నారు. ఏ స్త్రీకయినా నీ భర్త నిన్ను వదిలి వెళ్ళడని
ఎవరు చెప్పినా కొండంత ధైర్యం వస్తుంది. ఈ శుభవార్తని సాక్షాత్తు మెహెర్‌బాబావారే
చెప్తుంటే నర్గిస్ గాలిలో తేలిపోయింది. “అయ్యో! అనవసంగా నోరు పారేసుకొన్నానే.
తప్పు చేశానే అనుకొంటూ లెంపలు వేసుకొంది.
ప్రభు నామం గానం చేసింది మనసారా.
ఈ సంఘటన జరిగిన దరిమిలా నర్గిస్ మెహెరాబాద్‌లో స్థిరపడింది.
సావక్ కొత్వాల్ మండలిలో చేరాడు. బాబావారిని కలిసే సరికి నర్గిస్‌కి ఆరోగ్యం
బాగాలేదు. జీర్ణకోశపు వ్యాధితో బాధపడుతోంది.
అదొక రకమయిన క్షయ అన్నారు డాక్టర్లు. బాబావారు దగ్గరకి తీసుకొని లాలించారు.
“నేను దగ్గర వుండగా చింత ఎందుకు అని బాబా లాకెట్టుని ఇచ్చారు.
నీళ్ళ గ్లాసులో ఈ లాకెట్టుని వేయి. ఆ నీళ్ళు రోజూ త్రాగు.
నీళ్ళు త్రాగుతూ నా నామస్మరణచేయి అని ఆదేశించారు.
ప్రభువాజ్ఞని నర్గిస్ తు.చ. తప్పకుండా పాటించింది. క్షయ వ్యాధి మటుమాయమయింది.
ఆఘూ ఆలీ వంటి కుర్రాడు కావాలి తమ పనికని బాబావారు శెలవిచ్చారు
ఓ రోజున. బొంబాయి వెళ్ళి వెతకమన్నారు ఛాన్జీని.
అతగాడు వెంటనే ఆ మహానగరానికి బయలుదేరాడు.
ఆఘూ ఆలీ ఎంత ఉద్దండుడో పాఠకులకి తెలుసు.
అటువంటి పిల్లలు కారణజన్ములు. ప్రతి యుగంలో ఏ కొందరో వుంటారు అటువంటి
వాళ్ళు. ఈ సంగతి ఛాన్జీ గారికి తెలుసు. అందుకనే బొంబాయిలో తెలిసిన వాళ్ళందర్ని
కలుస్తున్నాడు. తెలిసిన జాగాలకి వెళ్తున్నాడు. కొత్తచోట్ల వెతుకుతున్నాడు.
ఇంతలో బాబావారి నుంచి టెలిగ్రామ్ వచ్చింది. శ్రద్ధగా వెతుకు,
మంచి కుర్రాడిని తీసుకురా – ఇదీ ఆ టెలిగ్రామ్ సారాంశం.
ఛాన్జీ తన ప్రయత్నాన్ని మరింత ముమ్మరం చేశారు.
ఇంతలో మరో టెలిగ్రామ్ వచ్చింది. ఎంత వరకు వచ్చింది నీ పని.
త్వరగా పని పూర్తిచేసి నాసిక్ వాపస్ రా!!అని బాబావారు పంపారా టెలిగ్రామ్‌ని.
తనకి అప్పగించబడిన పని ఎంత ఉత్కృష్టమైనదో ఛాన్జీ గారికి మరోసారి

అవగతమయింది. కానీ ఏమి లాభం? ఎంత వెదికినా, వీధి వీధిలో గాలించినా, ఆఘూ ఆలీ వంటి కుర్రాడు కనిపించడం లేదు సరికదా మెహెర్‌బాబావారి గురించి నలుగురికీ చెప్పాల్సి వస్తోంది. ఇహ లాభం లేదని నాలుగు రోజుల తర్వాత నవంబరు 27వ తేదీన ఛాన్జీ నాసిక్‌కి తిరిగి వచ్చాడు.

బాబావారు నాలుగు అక్షింతలు వేశారు.

నేను చెప్పిన పని చేయలేదని నిష్ఠూరంగా అన్నారు.

రెండు టెలిగ్రాములు పంపాను. అయినా ఆఘూ ఆలీ వంటి కుర్రాడిని తేలేదు సరికదా చేతులు ఊపుకొంటూ వెనక్కి వచ్చావు అని ఎద్దేవా చేశారు.

ఇంకా ఏమన్నారో తెలుసా? 'నా పాదాలపై శిరస్సు పెట్టి మరీ చెప్పావు.

బాబా మీ ఇచ్ఛ ప్రకారం నడుచుకొంటానని, కానీ ఏంచేశావు?

నా ఇచ్ఛని పట్టించు కోలేదు. పాదాభివందనం అంటే తెలుసా?

నా ఇచ్ఛకి కట్టుబడి వుంటామని చెప్పడం.

నా ఇచ్ఛ నెరవేరుస్తామనీ, దీక్ష పట్టడం. కానీ నువ్వు నా ఇచ్ఛ ప్రకారం నడుచుకొన్నావా? లేదు. అంటే నువ్వు చేసింది ఏమిటి?

ఏదో మొక్కుబడిగా నాకు మొక్కుతున్నావ్?

ఇదేనా నువ్వు చేయాల్సింది? అని బాబావారు దులిపేశారు.

పాపం ఛాన్జీగారికి నోట మాట రాలేదు. బాబావారికి కోపం తెప్పించానని తెలుసు. కానీ ఏం చేయను ప్రభూ! ఎంత వెతికినా మంచి కుర్రాడు దొరక్కపోతే? ఇది నా తప్పు అంటావా? అని అడగాలనుకొన్నాడు. కానీ ధైర్యం చేయలేదు. బహుశా నేను అంతగా గట్టి ప్రయత్నం చేయలేదేమోనన్న ధర్మ సందేహంలో పడ్డాడు. ఇంకోసారి బొంబాయి వెళ్ళి వెదికితే ఎలా వుంటుందన్న ఆలోచన వచ్చింది. ఈ మాట బాబావారితో చెపితే ఏమంటారో అని సందేహిస్తుంటే, బాబావారు ఏమన్నారో తెలుసా పాఠకమహాశయా! ఊహించగలరా?

బొంబాయి వెళ్ళు మళ్ళీ. మంచి పిల్లాడితోటే తిరిగిరా అన్నారు.

పిల్లాడు దొరక్కపోతే రాకు అన్నారు. ఈ రాత్రికే ప్రయాణం కట్టమన్నారు.

రోగి కోరిన మందు, డాక్టరు ఇచ్చిన మందు ఒక్కట్టే. ఇహ కావాల్సింది ఏముంది.

ఛాన్జీ గారు బొంబాయి రైలు ఎక్కారు. మండలివారు నాసిక్ రోడ్డు పట్టారు.

మీరూ వెతకండి అని బాబావారు అనడంతో వారు మరో కొత్త ఆఘూ కోసం గాలింపు మొదలెట్టారు. మూడు రోజులు నాసిక్ అంతా తెగ తిరిగారు.

ఓ పన్నెండు మందికిపైనే దొరికారు వాళ్ళకి. వాళ్ళని గ్యాస్ మంజిల్‌కి తెచ్చారు.

కొంతమందిని చూసి బాబావారు పెదవి విరిచారు. వాళ్ళని వెంటనే పంపించేశారు.

ఇంకొంతమందిని ఓ నాలుగు, ఐదు రోజుల తర్వాత "వీళ్ళనీ దింపేసి రండి" అన్నారు.

ఇలా అని మండలి తెచ్చిన పిల్లలు ఎవరూ బాబావారికి నచ్చలేదని కాదు.
సంఖ్యామానం తెలీదు కానీ కొంతమంది బాబావారికి నచ్చారు.
వాళ్ళతో తమ ఆంతరంగిక కార్యక్రమాన్ని నిర్వహించారు.
ఈ దైవీ కార్యక్రమం ఏమిటో చరిత్రకారుడు ఎక్కడా చెప్పలేదు.
ఆధ్యాత్మిక మార్గంలో మానవాళిని ముందుకు త్రోయడానికి ఈ కార్యక్రమం దోహదపడింది అనుకోవాలి. పిల్లలతో ఆడుకొన్నారు. వాళ్ళకి మంచి బట్టలు కొన్నారు. బాబావారు పౌష్టికాహారం పెట్టేవారు. మన మండలివారికి మాత్రం ఈ పిల్లలు చిచ్చరపిడుగుల్లా కనిపించేవారు. ఈ పిల్లలు కా అంటే కా, కీ అంటే కీ అనాల్సిందే మండలివారు. ఎందుకో తెలుసా? ఈ పిల్లలకి ఏలోటు జరిగినా బాబావారు సహించరు. వాళ్ళు ఎప్పుడూ ఆనందంగా సంతోషంగా కనబడాలి. పొరపాటున ఏ పిల్లాడయినా బేరు మన్నాడంటే, బాబోయ్! అసలు ఆ సన్నివేశం ఊహించడమే కష్టం. బాబావారికి కోపం రావచ్చు. పిల్లాడు ఇంటికి పోతానని ఏడుస్తూ కూర్చోవచ్చు. అసలు అటువంటి పరిస్థితి ఎందుకు తేవాలి?
కొత్త కష్టాలని ఎందుకుకొని తెచ్చుకోవాలి? అందుకనే మండలివారు ఈ పిల్లలకి రాచమర్యాదలు చేస్తున్నారు. నడివయస్సులో పడుతున్న మండలివారు అభం శుభం తెలియని పిల్లల మాటని వేదవాక్కులా చెవివొగ్గి వింటున్నారు. వాళ్ళ ఇచ్ఛ నెరవేరుస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే కొండమీద కోతి కావాలన్నా ఇప్పుడే తెస్తామంటున్నారు. నిద్రలో లేచి కూర్చుని అడిగినా వాళ్ళ మాట కాదనటం లేదు. ప్రొద్దుట కానీ, మధ్యాహ్నం కానీ, సాయంత్రమయినా ఎప్పుడయినా సరే, పిల్లలు ఏది కావాలి అంటే, ఎలా కావాలి అంటే, చిత్తం అంటున్నారు.
వాళ్ళ కోర్కె నెరవేరుస్తున్నారు. ఇదంతా మెహెరీశుని లీల.
పిల్లల పేరు చెప్పి బాబావారు మండలివారి అహంకారం, అహంభావం అణచివేస్తున్నారు. ఎన్నో జన్మలు ఎత్తినా దొరకని సంస్కారాన్ని బహుమతిగా ఇస్తున్నారు.
మండలివారు ఎంత అదృష్టవంతులో కదూ! ఏమాటకి ఆ మాట చెప్పుకోవాలి. అదృష్టవంతులు కాబట్టే కదా ఈ యుగావతారుడి సాన్నిధ్యంలో జీవించి తరించే భాగ్యం వాళ్ళకి దొరికింది. సరే ఇంతకీ ఆఘూ ఆలీ వంటి కుర్రాడు దొరికాడా? ఈ ప్రశ్న అడగకండి. ఆఘూ ఆలీ, ఆఘూ ఆలీనే. అతడాడి వంటి కుర్రాడు మరొకడు వుండడు. ప్రహ్లాదులు వంద మంది లేరు చరిత్రలో. ప్రహ్లాదుడు ఒక్కడే ఒక్కడు. అతగాడొక ఆణిముత్యం. మన ఆఘూ ఆలీ కూడా అంతే. మరి అటువంటి కుర్రాడు కావాలని బాబావారు పట్టుబట్టడం ఎందుకు అంటారా, అందుకు కారణం వుంది. బాబావారికి నచ్చిన, బాబావారు మెచ్చిన కుర్రాడు దొరికితే, పరిష్యా నుంచి ఆఘూ ఆలీ తిరిగివస్తాడట. డిసెంబరు 3వ తేదీన బాబావారే స్వయంగా శెలవిచ్చారు

ఈ మాట. ఆలీతో తాము నిర్వహించాల్సిన దైవీ కార్యక్రమం ఇంకా చాలావుందని పేర్కొన్నారు. ఆఘూ కనుక వచ్చి, నాతో వుంటే, నా పనికి ఎంతో వెసులుబాటు వుంటుందని అన్నారు. ఆలీ కోసం, తమ విశ్వ కార్యక్రమం కోసం, శాయశక్తులా ప్రయత్నించండి. దుర్భిణీ వేసి గాలించి పట్టుకోండి మంచి పిల్లాడిని అని మండలివారిని ఆదేశించారు. ఈ మంచి బాలుడి కోసం గాలింపు ఒకరోజా రెండు రోజులా, చాలారోజులు, సంవత్సరాలు గడిచినా బాబావారికి నచ్చిన పిల్లాడు దొరకలేదు. మండలివారందరూ పాల్గొన్నారీ గాలింపులో. అప్పట్లో బాబావారు వాళ్ళకి అప్పగించిన అతి ఉత్కృష్టమైన పని ఇది. ఒక్కోసారి ఫలానా ఊళ్ళో మంచి దైవభక్తి వున్న కుర్రాడు వున్నాడని తెలిస్తే చాలు, పరుగున వెళ్ళేవారు.
ఆ ఊరు ఎంత దూరమయినా సరే లెక్క చేసేవారు కాదు.
మాకు కావాల్సింది బాబావారి సంతోషం. మా బాబావారికి కావాల్సింది మంచి బాలుడు. దూరమయినా ఫరవా లేదు అనుకొనేవారు మండలివారు.
కానీ, వాళ్ళు కష్టం గట్టెక్క లేదు ఎప్పుడూ ఎంతమందిని తెచ్చినా బాబావారు పెదవి విరిచేవారు. ఏదో ఒకటి రెండు రోజులు మొక్కుబడికి అన్నట్లు వాళ్ళని దగ్గర వుంచుకొని త్రిప్పిపంపేవారు. బాబావారు నాసిక్‌కి వచ్చినప్పటి నుంచీ, రోజూ చాలామంది ప్రభు దర్శనానికి వస్తున్నారు. అడపాదడపా భజన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రభు నామ సంకీర్తన జరుగుతోంది. సిద్ధూ, జాల్, పెద్ద ఆదీ ఘజల్స్ పాడుతున్నారు ప్రభు సమక్షంలో కూర్చుని. ఘజల్స్ అంటే బాబావారికి చాలా ఇష్టం. **హూమా** అన్న పేరుతో బాబావారు చాలా ఘజల్ పాటలు వ్రాశారు గతంలో. మృధుమధురంగా ఆదీ పాడుతుంటే, మెహెరీశుడు ఆనందంగా తాళం వేస్తున్నాడు. అదొక మధురాతి మధురమైన దృశ్యం. మౌనావతారుడి మౌనగానం అందర్నీ అబ్బురపరుస్తోంది. నాసిక్ వచ్చినప్పటి నుంచీ బాబావారికి ఓ కొత్త పని పడింది. రాత్రి పగలు ఎందరో వస్తున్నారు. తమ గోడు వెళ్ళబుచ్చుకొంటున్నారు. వాళ్ళ వేదనని సావధానంగా విని, ప్రభువు హిత వాక్యాలు చెప్తున్నారు.
ఈ వ్యక్తిగత సమస్యలకి సమాధానం చెప్పడంలో బాబావారికి ఊపిరి సలపటంలేదనవచ్చు. అలా అని ఎప్పటిలా ఆధ్యాత్మిక సంగతులు చెప్పటం మానలేదు. ఎన్నో సృష్టి మర్మాలని సోదాహరణంగా వివరిస్తున్నారు.
నవంబరు నెల కావటంతో కాస్తంత చలిగానే వుంటోంది.
అయినాసరే పాండు లీనా గుహలకి బాబావారు చాలాసార్లు వెళ్ళివచ్చారు. గంగాపూర్ జలపాతానికి ఒకసారి వెళ్ళారు. నవంబర్ 30వ తేదీన కాలేమామ వచ్చాడు. వెంట భార్య జానకి కూడా వచ్చింది. ప్రభు దర్శనం నేనూ చేసుకోవాలి అంటూ, కాలేమామ అన్న గారు కూడా వచ్చారు. ఆయన పేరు అన్నా సాహెబ్

కాలే. ఈ ముగ్గురూ బాబావారికి అత్యంత ఆప్తులు కాబోతున్నారట.
అది ఎలాగ అంటారా, వీళ్ళు బాబా మండలిలో చేరుతున్నారు.
ఈ మాటని బాబావారే స్వయంగా చెప్పారు.
కాలే కుటుంబీకులకు ఏ లోటు రాకూడదన్నారు. మంచి బస ఏర్పాటు చేయమన్నారు.
ఈ ఏర్పాట్లని బాబావారే స్వయంగా దగ్గర వుండి చేయించారు.
దీన్ని బట్టి తెలుస్తుంది కాలేమామ బాబావారికి ఎంత దగ్గరివాడో.
డిసెంబర్ ఒకటిన బాబావారు కారులో షికారుకి బయలుదేరారు.
దారిలో రైల్వేస్టేషన్ దగ్గర కాసేపు ఆగారు. ఫ్లాట్‌ఫారమ్‌పై పచార్లు చేశారు.
ఇది గమనించిన టిక్కెట్టు కలెక్టరు స్టేషన్ మాస్టర్‌కి చెప్పాడు.
ఆయనకి బాబావారి గురించి తెలుసు.
స్టేషన్ మాస్టారు కూడా బాబావారి గురించి విన్నాడు.
విభూతి చెప్పాడతనికి బాబావారి అవతార విశిష్టత గురించి.
అందుకనే వెంటనే పరుగెత్తుకు వచ్చి ప్రభువుకి భక్తితో నమస్కరించాడు.
ఫస్ట్‌క్లాస్ వెయిటింగ్ రూమ్‌లో కూర్చోండి బాబా, అక్కడ మీకు ఏ ఇబ్బందీ వుండదన్నాడు.
కానీ బాబా సుముఖత చూపలేదు. ఫ్లాట్‌ఫారమ్‌పైనే బాగుంది అంటూ ఓ చెక్క పెట్టెని
వేస్తే దానిపై కూర్చున్నారు. మాస్టరు గారికి నోట మాట రాలేదు.
అవతార పురుషుడు ఏమిటి, మామూలు మనుష్యుల్లా చెక్క పెట్టెపై
కూర్చోవటమా అని కొట్టుకుపోయాడు.
బాబావారికి నచ్చచెప్పాలని వుంది కానీ ధైర్యం చేయలేకపోయాడు.
నీ స్మరణ రోజూ చేస్తున్నాను దీనబంధూ. నీ దర్శనం కోసం తపిస్తున్నాను.
నా కోరిక ఈవాళ్టికి తీరింది అనుకొన్నాడు. మనసులో మాట ప్రభువుకి చెప్పాడు.
షెరియార్జీసుతుడు చిరునవ్వు నవ్వాడు. నేను స్టేషన్‌కి ఎందుకు వచ్చాననుకున్నావ్?
నీ కోరిక తీరుద్దామనే అన్నాడు. స్టేషన్ మాస్టరు టీ తెప్పించాడు.
బాబావారికి వెంట వచ్చిన మండలివారికీ స్వయంగా టీ అందించాడు.
స్టేషన్ సిబ్బంది అందరూ వచ్చారు. ప్రభు దర్శనం మాకు ఇప్పించరు అని స్టేషన్
మాస్టర్‌ని అడిగారు. ఆయన వాళ్ళ కోర్కెని ప్రేమమూర్తికి నివేదించాడు.
ప్రభువు అభ్యంతరం చెప్పలేదు సరికదా అందరికీ ఓపికగా
తమ శుభాశీస్సులనందించారు. డిసెంబరు 7వ తేదీన బాబావారు బొంబాయి వెళ్ళారు.
వెంట మండలివారూ కదిలారు. బాబావారి రాక ముందుగానే తెలియటం వల్ల,
ప్రభు దర్శనానికి కైకోబాద్ దస్తూర్, కాకా బారియా, దాదా ఛాన్జీ కుటుంబం ఇంకా
చాలామంది వచ్చారు. దర్శనానికి చక్కటి ఏర్పాట్లు జరిగాయి. అందరూ తనివితీరా
మెహెర్ ప్రేమామృతాన్ని ఆస్వాదించారు. మొత్తం మూడురోజులు జరిగిందీ దర్శన

కార్యక్రమం. మూడు రోజులు తర్వాత అంటే డిసెంబర్ 10వ తేదీన బాబావారు నాసిక్‌కి తిరిగివచ్చారు. ఆ వేళ బాబావారు సద్గురువుల పని గురించి చెప్పారు. మనోనాశ్ ఆవశ్యకతని వివరించారు. మంచి ఆలోచనలు, చెడ్డ ఆలోచనలు, చెడు, మంచి భావనలు, మాటలు, ఆచరణ వీటన్నింటికీ కారణం మనస్సు.
మనోనాశ్ జరిగితే ఉన్నతాత్మ అయిన భగవంతుడిని తెలుసుకొంటుంది ఆత్మ అంటూ సద్గురువులు, కుతుబ్ ఎంత మేలు చేస్తారో పేర్కొన్నారు.
ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదిస్తారు సద్గురువులు, కుతుబ్‌లు.
అలానే వాళ్ళు మరో పనిచేస్తారు. అది ఏమిటి?
ఏమిటి అంటే మంచి ఆలోచనలు కల్గిస్తారు.
భవిష్యవాణి కూడా సద్గురువుల నోట పలుకుతుంది అని తెలియజేశారు.
ఏదో ఎప్పుడో కొన్ని సంవత్సరాల తర్వాత ఏమి జరుగుతుందో ఊహించాలన్న ధ్యాస నీకు కలగకముందే, సద్గురువులు జోస్యం చెప్తారన్నారు.
ఈ శక్తి సద్గురువుల సొత్తు ఎందుకయిందో వివరించారు.
విశ్వవ్యాప్తమైన మనస్సుతో ఏకమైన సత్పురుషులు వీరు.
విశ్వవ్యాప్తమయిన మనస్సు ఎవరు? పరబ్రహ్మ పరమాత్మ.
వెలుతురు అదే జ్ఞానాన్ని ప్రసాదిస్తున్నాడు.
మంచి ఆలోచనల్ని కల్గిస్తున్నాడు అంటే మనస్సుని భగవంతుని వైపుకి మళ్ళిస్తున్నాడు.
అదీ ఇదీ అని లేదు. మానవాళికి సర్వస్వాన్నీ విశ్వమానవుడు సమకూరుస్తున్నాడు.
ఇందువల్లనే సద్గురువులు, కుతుబ్‌లు భవిష్యవాణి పలకడమే కాదు.
భవిష్యత్‌ని నిర్దేశిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే సద్గురువుల ఇచ్ఛ ప్రకారమే వివిధ విషయాలు దైవేచ్ఛ అవుతాయి.
అలానే సద్గురువుల అభీష్టం మేరకే ఏ విషయమైనా దైవేచ్ఛగా మారుతుంది.
ఈ ప్రకారంగా బాబావారు సద్గురువుల పనిని విశదీకరిస్తుంటే,
ఒక శ్రోతకి ధర్మ సందేహం వచ్చింది. ఠపీమని అడిగేశాడు.
మా పాపాలకి మేము బాధ్యులం కామంటారా అని ప్రశ్నించాడు.
ఎవరు తవ్విన గోతిలో వాళ్ళే పడతారని కదా మన నానుడి.
బాబావారు ఏమన్నారో తెలుసా, ఊహించగలరా?
బాబావారి జవాబులో మనకి ఇంతకాలం తెలియని ఓ సృష్టి చిత్రం వెల్లడి అయింది.
నీ పాపానికి నువ్వు బాధ్యుడివి కావు. కానీ తప్పు నాదేనని ఒప్పుకొంటే పరిపూర్ణ స్థితివైపుకి అడుగులు వేస్తావు అని సాధికారంగా ప్రకటించారు.
"ఏమాట కామాటే చెప్పాలి. నీ పాపాలకి నువ్వు బాధ్యుడివి కావు.
కానీ అణుకువ పేరు చెప్పో, వినమ్రత పేరు చెప్పో ఈ తప్పుకి నేనే బాధ్యుడని

నువ్వు ఒప్పుకోవాలి. అలా మంచీ చెడు రెండూ అనుభవించాలి.
ఇలా చేస్తూపోతే పరిపూర్ణ స్థితివైపుకి నడిపించబడతావు తప్పకుండా
అని బాబావారు విశదం చేశారు.
డిసెంబరు 14న బాబావారు ధులియా వెళ్ళివచ్చారు. ధులియా నివాసి మన కాలేమామ.
అక్కడ ఆయన ప్రభుత్వోద్యోగి. మా ఇంటిని పావనం చేయి బాబా మరోసారి అని
భక్తుడు వేడుకొన్నాడు. ప్రభువు భక్తుడి కోరిక తీర్చాడు.
ధులియా నుంచి వచ్చేసరికి బాగా చీకటి పడింది.
ఆ మర్నాడు మండలివారి అదృష్టం పండింది.
సద్గురువులకీ అవతారుడికీ గల తేడాని యుగావతారుడే స్వయంగా వెల్లడించారు
వాళ్ళకి. భగవత్ సాక్షాత్కారం పొందిన ప్రతివ్యక్తీ పరిపూర్ణ పురుషుడేనట.
కానీ అటువంటివారు సద్గురువుల అవతారుని కోవలకి రారుట.
సద్గురువులు, అవతారులు దివి నుండి దిగివస్తారు మానవాళిని ఉద్ధరించడానికి.
అందువల్ల వాళ్ళ దృష్టి ఎప్పుడూ ఏ ఒకరిద్దరిపైనో వుండదు.
వాళ్ళ తపన ఎప్పుడూ యావత్ మానవాళి కోసం, యావత్ విశ్వం కోసమే.
అందుకనే సద్గురువులదీ అవతారుడిదీ విశ్వాత్మకమైన మనస్సు అని
బాబావారు పేర్కొన్నారు. ఈ ఉభయులు తమ దివ్యశక్తిని ఇతరుల కోసం అంటే
ప్రజా శ్రేయస్సు కోసమే ఉపయోగిస్తారని బాబావారు శెలవిచ్చారు.
మరి ఈ పని ఎలా చేస్తారు? ఆ మాట బాబావారు శెలవివ్వలేదు కానీ
ఆ పని ఎక్కడ నుంచి చేస్తారో చెప్పారు.
విజ్ఞాన భూమికలో పని చేస్తారు సద్గురువులు, అవతారుడు.
అక్కడే వారు విశ్రమించేది కూడా అని అన్నారు.
మనకి ఎంత వరకు సప్తభూమికల గురించే తెలుసు.
పరిణామ క్రమంలో రాతి నుంచి మనిషిలా మారిన ఆత్మ భగవత్ చింతనలో
మంచి సంస్కారాలని ప్రోగుచేసుకొంటూపోతే ఏదో ఒకరోజుకి
సప్తమ భూమిక చేరుతుందని బాబావారే శెలవిచ్చారొకసారి.
ఈ మానవ ప్రయత్నం చిటికెలో సఫలమవుతుంది.
దివి నుండి భువికి దిగివచ్చిన పరబ్రహ్మ పరమాత్మ అనుగ్రహం వుంటే చాలు
అని కూడా చెప్పారు. ఈ విజ్ఞాన భూమిక ఎక్కడుందో ఈవాళ చెప్పారు.
భగవదైక్యం లభించే పై లోకానికీ, ఆధ్యాత్మికోన్నతి కోసం పరితపించే
మానవాళి వున్న క్రింది లోకానికీ మధ్య వుందట.
"పైలోకానికీ, క్రిందిలోకానికీ మధ్య గడప విజ్ఞాన భూమిక" అని బావావారు చెప్పారు.
ఈ రెండు లోకాల పనిని విజ్ఞాన భూమిక నుంచే నిర్వహిస్తారుట సద్గురువులు.

ఊర్ధ్వ అధోలోక పనిని విజ్ఞాన భూమిక నుంచి సద్గురువులు నిర్వహిస్తారు" అని బాబావారు స్పష్టం చేశారు. ఇంకో మాట చెప్పారు.

ఊర్ధ్వ లోకాయానానికి ఆత్మలని సంసిద్ధులని చేయడం, ఊర్ధ్వ లోకానికి పంపడం, చివరకి భగవదైక్యం కల్గించడం, ఇదంతా సద్గురువులు పనిలో ఒక భాగం అని చెప్పారు. మరింకే పని చేస్తారో, ఆ దైవీ కార్యక్రమం ఏమిటో మాత్రం వివరించ లేదు. సద్గురవుల దృష్టి భక్తితో నిండినవారిపైన వుంటుందని చెప్పకనే చెప్పారు.

బాబావారి ఉవాచ వినండి. మీకే తెలుస్తుందీ సంగతి.

పండిన ఆత్మలని అత్యున్నత స్థితికి తీసుకువెళ్ళాలన్న ప్రత్యక్ష్య లక్ష్యంతోనే సద్గురువులు దివి నుండి భువికి దిగివస్తారు.

అలా వస్తున్నప్పుడు వాళ్ళది విశ్వాత్మకమై మనస్సు.

అనునిత్యం మానవాళితో తమ దైవీ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు అని బాబావారు శెలవిచ్చారు. పండిన ఆత్మలు అంటే ఎవరో బాబావారు చెప్పలేదు.

భక్తిలో మునిగి, భగవత్ సాక్షాత్కారం కోసం పరితపిస్తూ,

ఆ సుమధుర ఘడియ కోసం చకోరపక్షిలా ఎదురుచూస్తున్న వ్యక్తులు

పండిన ఆత్మలు అని మనం చెప్పుకోవచ్చు.

వీళ్ళకి సద్గురువులు తమ విశ్వాత్మకమైన మనస్సుతో మోక్షప్రాప్తి కల్గిస్తారు.

ఇది ఎలా చెప్తారు? వాళ్ళ పాపాలని అంటే చెడ్డ సంస్కారాలని తమపై వేసుకుని ఆ పాపాల బాధలని అనుభవిస్తారు. ఆత్మ ద్వారా పరమానందాన్ని,

మనస్సు ద్వారా బాధలని తమ సొంతం చేసుకొంటారు సద్గురువులు.

ఇది ఎలా సాధ్యమవుతుందో బాబావారు స్వయంగా వివరించారు.

పరమాత్మతో ఏకమైన ఆత్మ సద్గురువులది కాబట్టి ఆత్మ ద్వారా పరమానందంలో తేలిపోతారు. అలానే యావత్ విశ్వానికి చెందిన బాధలని తమ విశ్వాత్మకమైన మనస్సు ద్వారా అనుభవిస్తారు అని చెప్పారు. మరి ఈ ప్రకారంగా సద్గురువులు పనిచేస్తే, అవతారపురుషుని పని ఏమిటి? అవతారుడుగా ప్రకటితమైన వ్యక్తి యావత్ మానవాళినీ ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు త్రోస్తారు.

కానీ అవతారుడికి మరో విధి వుంటుంది. అది మానవాళిని ఆధ్యాత్మికంగా పైకి త్రోయడం. ఇదే ఈ ఉభయుల్లో వున్న లేడా. ఈ ఆధ్యాత్మికోన్నతి కార్యక్రమం, అవతారుని సర్కిల్‌ని తీర్చిదిద్దే పనికంటే చాలా ఉత్కృష్టమైనది. సర్కిల్ తయారీ పనిని అటు అవతారుడు, ఇటు సద్గురువులు చేస్తారు అని బాబావారు అన్నారు.

ఈ ఉభయుల్లో మరో తేడా వుందన్నారు.

అవతారుడు పరిపూర్ణుడు అన్ని విధాలా. ఆధ్యాత్మికంగా, భౌతికంగా, ముఖ్యంగా శారీరకంగా కూడా పరిపూర్ణత్వం అవతారునిలో కనిపిస్తుంది.

అవతారుడు మనోహరంగా కన్పిస్తాడు. ముద్దుగా మళ్ళీ మళ్ళీ చూడాలనే
సుందర రూపం అవతారుడిది ఎప్పుడూ.
మొహం, అవయవాలు అందంగా పొందికగా వుంటాయి.
మరి సద్గురువులు ఇలా వుంటారు, శారీరకంగా వాళ్ళు వికారంగా వుంటారు.
ఒడ్డూ పొడుగూ గమ్మత్తుగా వుంటుంది. ఒక్కోసారి వాళ్ల అవలక్షణాలు చూస్తే వాళ్ళకేసి
చూడాలనిపించదు. అసహ్యం వేస్తుంది.
చీదరింపు కలుగుతుంది అని బాబావారు చెప్పారు.
బాబావారికి అతి ప్రీతిపాత్రుడైన కవి హాఫీజ్ అని పాఠకులకి తెలుసుగా.
ఆయన కూడా ఓ సద్గురువే. ఎంత చక్కటి ఘజల్ పాటలు వ్రాశాడో.
ఆ పాటలని ఆయన నోట వినాలని ప్రజలు తపించేవారు అంటే
హాఫీజ్‌ది ఎంత మధురమైన కంఠమో మీరూహించుకోవచ్చు.
తన పాటతో అందర్నీ తన్మయులని చేసే హాఫీజ్ అందగాడు కాడట.
అంటే ఇలనాటి ఉపాసనీ, నారాయణ మహరాజ్‌వంటి సద్గురువుల లాగా,
హాఫీజ్ కూడా మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే సౌందర్యమూర్తి కాదు.
ఈ మాటనే బాబావారు చెప్పారు.
ఏసు ప్రభువు, మహమ్మద్, జొరాస్టరు, బుద్ధుడు, రాముడు, కృష్ణుడు అవతారులు.
అందువల్ల మనోహరమూర్తులు. నేనూ అంతే...
మరి ఇప్పటి ఉపాసనీ మహరాజ్, నారాయణ మహరాజ్, తదితర సద్గురువుల
రూపాల్లో ఏదో ఓ వెలితి వుంది. మహరాజ్‌ది భారీ కాయం.
ఆయన శరీరం ఎంత పెద్దది అంటే, ఓ రాక్షసుడిలా కన్పించేవాడు.
మరి నారాయణ మహరాజ్ బాగా పొట్టి. ఎంత పొట్టి అంటే, మరగుజ్జు అంత పొట్టి.
ఇదీ అవతారునికీ సద్గురువులకీ రూపురేఖల్లో వుండే తేడా.
శారీరకం మాత్రమే, వాళ్ళ ఆధ్యాత్మిక స్థితిలో పెద్దగా తేడా వుండదు.
ఎందుకంటే దైవీకులు కాబట్టి అని బాబావారు సాధికారంగా చెప్పారు.
డిసెంబరు 18న ఇద్దరు జర్మనీ దేశస్థులు బాబావారి దర్శనానికి వచ్చారు.
ఒకాయన పేరు విక్టర్ స్టోంప్స్. రెండవ వ్యక్తి ఫిలిప్‌బాల్. బౌద్ధమతంపై ఆసక్తి పుట్టిందట.
బుద్ధుడు పుట్టిన భారతదేశం చూద్దామని వచ్చారుట.
ఆ తీర్థయాత్రలో భాగంగా నాసిక్ వచ్చారిప్పుడు. ఈ రాత్రికి ఎక్కడికిపోతారు.
ఇక్కడే వుండండి అంటూ బాబావారు
వాళిద్దరికీ తమ గ్యాస్ మంజిల్‌లోనే బస ఏర్పాటుచేశారు ఆ రాత్రికి.
మర్నాడు ప్రొద్దుట దర్శన సమయంలో విక్టర్, ఫిలిప్ అందరితోపాటు బాబావారి
సమక్షంలో కూర్చున్నారు. బాబావారు ఏం చెప్తారో అని ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.

అప్పుడు బాబావారు ఏమన్నారో తెలుసా?
విక్టర్‌ని ఇటలీ వెళ్ళు, నీ కోరిక తీరుతుందన్నారు. ఇటలీ వెళ్ళి ఏం చేయాలో చెప్పారు. అక్కడ ఒక బౌద్ధ సన్యాసి వున్నాడట. ఆ మహానుభావుడు మెహెర్‌ప్రభుని భక్తుడు. ఆధ్యాత్మిక మార్గంలో బాగా ముందుకు వెళ్ళారు. ఈ మాట బాబావారే స్వయంగా చెప్పారు."నువ్వు వెళ్ళి ఆ బౌద్ధ భిక్షుని దర్శించు. నన్ను ఎలా తెలుసుకోవాలో అతగాడు నీకు నేర్పుతాడు" అని బాబావారు విక్టర్‌కి చెప్పారు. ఆ బౌద్ధ భిక్షువు ఎవరో నీకు తెలియదు కానీ మీ ఇద్దరికీ పూర్వజన్మ సంబంధం వుంది అని కూడా బాబావారు తెలియజేశారు. మెహెరీశుడి మాటలు విక్టర్‌కి నచ్చాయి. వెంటనే ఇటలీ వెడతానన్నాడు.
మరి ఇటలీ వెళ్ళాడా, లేదా? ఏం చేశాడు ప్రస్తుతానికి తెలియదు.
బహుశా మున్ముందు తెలుస్తుందేమో చెప్పలేము.
ఇహపోతే విక్టర్‌తోపాటు వచ్చిన రెండవ జర్మన్ వ్యక్తి,
అదే ఫిలిప్‌బాల్ ఏం చేశాడు? అతగాడికి బాబావారు చెప్పిన హితవు ఏమిటి?
ఈ కథ వింటుంటే మనకి గతంలో బాబావారు మెహెరాబాద్‌లో వుంటున్నప్పుడు వచ్చిన ఓ సాధువు కథ గుర్తుకు వస్తుంది.
దైవసాక్షాత్కారం నా జీవిత ఆశయం, నా కోరిక తీర్చావా బాబా అంటూ అడిగిన ఆ సాధువు గారికి బాబావారు పెట్టిన చిన్న పరీక్షనే తట్టుకోలేక వచ్చిన దారిన చెప్పకుండా వెళ్ళిపోయాడు. పరీక్ష అంటే ఏదో ఆధ్యాత్మిక ప్రశ్నలు వేసి బాబావారు ఆ సన్యాసిని భయపెట్టారనుకోకండి.
ఇక్కడే మెహెరాబాద్‌లో కూర్చొని మౌనంగా భగవన్నామ స్మరణ చేయమన్నారు బాబా. ఇది నా తరం కాదన్నాడు. పలాయనం చిత్తగించాడు.
ఇంచుమించు ఇంతే చేశాడు ఫిలిప్‌బాల్ గారు కూడా.
అయితే మన మెహెరాబాద్ సాధువుకీ ఈయనకీ ఓ తేడావుంది.
ఆ మహానుభావుడు చెప్పాపెట్టకుండా రోడ్డున పడ్డాడు.
జర్మన్ దొర గారు మాత్రం బాబావారికి చెప్పి మరీ రోడ్డు ఎక్కాడు.
ఇహ వివరాలలోకి వస్తే, ప్రభూ, మీ దగ్గరే వుండాలని వుంది అన్నాడు.
దయామయుడు సరేనన్నాడు. ఇంకో మాట శెలవిచ్చాడు.
ఈ ఆశ్రమ జీవితం నీకు పడుతుందో పడదో?
అంతా కొత్త కదా అందుకని ఓ పని చేయి. కొద్ది రోజులు ఇక్కడ వుండు.
బాగుంది, ఉంటాను అని నీవు అన్న తర్వాత నీకు దీక్ష ఇస్తాను అన్నారు.
మరో మాట కూడా చెప్పారు. దేని గురించీ కొట్టుకుపోకు. నిర్లిప్తంగా వుండు.
మనస్సుని అదుపులో పెట్టుకో, నీకు కావల్సింది భగవంతుడు కదా.
ఇంకేమీ పట్టించుకోకు. దృష్టిని అటూ ఇటూ త్రిప్పకు.

పట్టుదలతో సాధనచేయి అన్నారు.

బాబావారి మాటలు జర్మన్‌వారికి నచ్చాయి. అయినా బాబావారు చెప్పినట్లే చేస్తానని వెంటనే అనలేదు. కాసేపు బుర్రకి పని చెప్పారు. కాసిన రోజులు మెహెర్‌బాబాతో వుంటే, నష్టం ఏమిటి అనిపించింది. అందుకనే, బాబా, మీరు చెప్పినట్లే, ఇక్కడ మీతో మీ ఆశ్రమంలో కొద్దిరోజులు వుంటాను అన్నాడు. "మంచిది" అన్నారు బాబా.

ఫిలిప్ బాల్ బాగోగులు చూసే బాధ్యతని ఓ ఇద్దరికి అప్పగించారు.

ఇతగాడికి ఏ లోటూ రాకుండా చూడాలి మీరు అని స్పష్టం చేశారు.

మండలివారికి బాబా అదేశాలు వింతగా కనిపించాయి.

బాబావారు అతనికి రాచమర్యాదలు చేయిస్తున్నారనిపించింది.

ఏమిటి అబ్బా, ఈ జర్మనీయుడి ప్రత్యేకత అనుకొన్నారు.

మండలివారి ధర్మసందేహం మర్నాడు తీరింది. ఉదయాన్నే బాబావారి సమక్షానికి బాల్ దొర గారు వచ్చారు. వినమ్రంగా నిలబడ్డారు. మీతో ఓ మాట మనవి చేయాలని వుంది అన్నారు. "సందేహం ఎందుకు మనస్సులో మాట చెప్పు" అని ప్రభువు అన్నాడు.

'నాకు ఇక్కడ వుండాలని లేదు బాబా! తీర్ధయాత్రలకి వెళ్దామనిపిస్తోంది"

అంటూ నీళ్ళు నమిలాడు. నీకు ఇక్కడ బాగాలేదా?

అసౌకర్యంగా వుందా అని ప్రేమమూర్తి ప్రశ్నించాడు.

బాబావారి ప్రశ్నకి ఏమి జవాబు చెప్తాడోనని మండలివారు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అతగాడికి కాస్తంత చెమటలు పట్టాయి. నాకు ఇక్కడ ఇబ్బంది ఏమీ లేదు,

కానీ ఎందుకో వుండాలనిపించడం లేదు. నా బుర్ర ఒక్కటే తొలుస్తోంది.

మీరు ఊ అంటే నా దారిన వెళ్తాను అని మనవి చేశాడు.

"సరే, నీ ఇష్టం" అన్నారు మెహెరావతారుడు.

బుర్ర తొలుస్తున్నంత సేపు నీకు ప్రశాంతత చిక్కదు.

శాంతి కావాలంటే మనస్సుని నిశ్చలంగా వుంచాలి.

తీర్ధయాత్రలకి వెడతానంటావా? వెళ్ళు ఆ అనుభవమూ నీకు కావాలి" అన్నారు.

ఓ చిన్న చురక వేశారు. "మనస్సు చెప్పినట్లు ఆడితే,

గురువు మాటని పట్టించుకోలేవు.

నీకు దేముడు దొరకడు" అని హెచ్చరించారు.

ఈ ప్రపంచంలో అన్ని అనర్ధాలకీ మనస్సే కారణమని స్పష్టంచేశారు.

ఫిలిప్ బాల్ తలాడించాడు. నమస్కరించాడు.

రోడ్డున పడ్డాడు. మళ్ళీ తిరిగి రాలేదు.

**సశేషం**

కొత్త పుస్తకం

## How A Master Works by Ivy Duce

# సద్గురు కార్యసరళి




పాశ్చాత్య బాబా ప్రేమికురాలు శ్రీమతి ఐవీ ఓనెటా డ్యూస్ ఇంగ్లీషులో ప్రచురించిన **How A Master Works** గ్రంధాన్ని తెలుగులో **"సద్గురు కార్యసరళి"** శీర్షికతో, అనువదించి, అవతారుని 122వ జన్మదినం సందర్భంగా, 2016 ఫిబ్రవరి 25న అవిష్కరించారు. **శ్రీ తాడిమేటి అక్బర్ కృష్ణ** తెలుగులో స్వేచ్ఛానువాదం చేశారు. ఇంతక్రితం శ్రీ అక్బర్ కృష అవతారుని సాహిత్యంలోని **Infinite Intelligence** గ్రంథాన్ని **'అనంతప్రజ్ఞ'** పేరుతోనూ, డాక్టర్ విలియం డాన్‌కిన్ రచించిన **The Wayfarers** గ్రంథాన్ని **'బాటసారులు'** పేరుతో సరళ తెలుగులో అందించారు. ఆ కోవలోనే సద్గురు కార్యసరళి గ్రంధాన్ని తేటతెలుగులో అనువదించి, తెలుగు గ్రంధాలని మాత్రమే చదవగలిగే బాబా ప్రేమిక పాఠకులకు అందజేసి ఎనలేని సాహిత్య సేవ చేశారని చెప్పాలి. ఇందుకు అనువాదకుడు అక్బర్ కృష్ణకు అభినందనలు. మెహెర్‌బాబా ప్రేమికలోకానికీ, ఆధ్యాత్మికపథంలో వున్న వారందరికీ ఈ గ్రంధం ఓ కరదీపిక కాగలదు. 615 పేజీలు గల ఈ అమూల్య గ్రంధాన్ని నిరంతరమూ వెన్నంటివుండే దివ్య ప్రియతముడైన మెహెర్ ప్రభువు పాదపద్మాలకు సమర్పిస్తున్నామని, ముందు పేజీలలో పేర్కొన్నారు. ఈ ఉద్గ్రంధంలో ప్రధానంగా – అవతారుని కార్య విధానం, ప్రేమికుల కర్తవ్యం, ఆయన్ని ఎలా అనుసరించాలి? అనే విషయాలను శ్రీమతి డ్యూస్ చక్కగా

వివరించారు. 1948లో శ్రీమతి డ్యూస్ అవతార్ మెహెర్‌బాబావారి సాన్నిధ్యంలోకి వచ్చారు. ఆనాటి నుండీ 1969లో మెహెర్‌బాబా భౌతిక దేహ త్యాగం చేసే దాకా మెహెర్‌బాబాతో గల తన సన్నిహిత సంబంధాన్ని, బాబా సమక్షంలో ఆవిడ అనుభవించిన వివిధ అనుభూతులను, అనుభవాలను అరమరికలు లేకుండా How A Master Works పేరిట గ్రంథస్థం చేశారు. యోగదృష్టి, అతీంద్రియ శక్తులు, అవతారుని శిష్య కూటమి, అవతారుని ప్రతినిధులు వారు నిర్వహించే విధులు, మహాత్ముల సమాధుల సందర్శనం వలన కలిగే ఫలితాలు ఇత్యాది విషయాలపై మెహెర్‌బాబా స్వయంగా చెప్పిన విషయాలను ఆమె చక్కగా వివరించారు. అవతార్ మెహెర్‌బాబాకు సంబంధించి ఇంతవరకు వెలుగులోకి రాని అనేక ఆసక్తికరమైన విశేషాలు, సంఘటనలు ఈ గ్రంథంలో లభిస్తాయి.

సూఫీయిజం రీఓరియెంటెడ్ – పునరుద్ధరింపబడిన సూఫీ సంప్రదాయమనే సంస్థకు ఐవీ డ్యూస్‌ని, ముర్షిదా (గురువు)గా, అవతార్ మెహెర్‌బాబానే స్వయంగా నియమించారు. మెహెర్‌బాబా 1894 ఫిబ్రవరి 25న పూణేలో జన్మించిన విషయం పాఠకులకు తెలుసు. ఐతే, ఐవీ డ్యూస్, ఆ మరుసటి సంవత్సరం, అంటే, సరిగ్గా ఒక సంవత్సరం తర్వాత, అనగా, ఫిబ్రవరి 25, 1895లో అమెరికాలో జన్మించింది. సూఫీ సంప్రదాయానికి అమెరికాలో ముర్షిదా (గురువు)గా వ్యవహరిస్తున్న రబియా మార్టిన్ తన మరణానికి కొద్దికాలం ముందుగానే సూఫీ సంప్రదాయానికి ఐవీ డ్యూస్‌ను తన వారసురాలిగా ప్రకటించారు. ఆధ్యాత్మిక ఆచార్య పీఠము యొక్క నియామకాన్ని నిరాకరించరాదన్నది నియమాచారం. అలా ఆమె గురువుగా నియమించబడ్డానని, శ్రీమతి ఐవీ చెప్తుంది. 1947లో రబియా మార్టిన్ మెహెర్‌బాబాను దర్శించుకుని, ఆయన భగవత్సాక్షాత్కారం పొందిన పరిపూర్ణ సద్గురువు అని తన శిష్య గణానికి ప్రకటించింది. **అవతారుడు ఆవిర్భవించినప్పుడు సర్వ సృష్టికి ఆధ్యాత్మిక త్రోపుని ఇస్తాడు. సృష్టిలోని సర్వజనులు, ప్రాణులు ఆయన రాక వలన ఆధ్యాత్మిక ప్రయోజనం పొందుతారు.** ఈ అంశం ఆధారంగానే శ్రీమతి ఐవీ డ్యూస్ ప్రచురించిన గ్రంథాన్ని తెలుగు పాఠకులందరూ తప్పక చదవితీరాలి. ఆధ్యాత్మిక సాహిత్యంలో **"సద్గురు కార్యసరళి" ఒక అరుదైన గ్రంథం.**

ఇది ప్రతి ఇంటా తప్పక వుండవల్సినది. పుస్తక వెల ప్రచురించ లేదు.
వెల అమూల్యం మాత్రం కాదు. మరిన్ని వివరాలకు, **ప్రాప్తిస్థానం-**
**శ్రీ తాడిమేటి అక్బర్ కృష్ణ, మెహెర్‌నగర్,**
**తాపేశ్వరం పోస్ట్, ఆంధ్రప్రదేశ్ - 533 340,**
**ఫోన్: 08855-230581,**
**సెల్: 8500648842.**

**సద్గురు కార్యసరళి–పే. 255 లోని ఒక ఆసక్తికర అంశమిది. దయచేసి పరిశీలించండి !!**

# చైతన్య భూమికలు

మెహెర్‌బాబా ఒక సహవాస్‌లో చైతన్య భూమికలు గురించి ఇలా వివరించారు. ఒక ఆధ్యాత్మిక చైతన్య భూమికలో ఉన్నవారు మరణిస్తే వారు తిరిగి అదే చైతన్య భూమికానుభవంలో మరల జన్మిస్తారు. కాని చైతన్యం క్రమక్రమంగా పెరుగుతూ ఉంటుంది. మామూలు స్థూల చైతన్యం కలవాడు చనిపోయి, స్థూల చైతన్యంతో పుట్టినట్లే జరుగుతుంది. పిల్లవాడు పెరిగేకొద్దీ తన పూర్వానుభవాలను గ్రహిస్తాడు. అలాగే ఒక చైతన్య భూమికలో ఒకడు పుట్టినప్పుడు ఒక్క మాటుగానే తన చైతన్య భూమిక స్థితిని తెలుసుకోలేడు. ఆ భూమిక గురించి క్రమంగా పిల్లవాడు పెరుగుతుండగా అతనికి వికాసం కలుగుతుంది. అతడు అంతకంటే ఉన్నత భూమికలోనికి వెళ్ళవచ్చు లేదా వెళ్ళకపోవచ్చు. వాని ఆధ్యాత్మిక ప్రగతి అంతకంటె ఉన్నత స్థాయి కలిగిన వాని సహాయంమీద ఆధారపడి ఉంటుంది లేదా ఆ భూమికలో తన యొక్క ప్రయత్నం మీదగాని లేదా ఆధ్యాత్మిక సద్గురువు యొక్క సహాయం మీదగానీ, అనుగ్రహం మీదగాని ఆధారపడి ఉంటుంది.

స్థూల, సూక్ష్మ, మానసిక లోకాలు, భగవంతుడూ అన్నీ నీలోనే వున్నాయి. నీ మానవ శరీరంలో ఉన్నాయి. మరో లోకంలో ఎక్కడో ఉన్నాయని అన్వేషించకు. అన్నీ నీలోనే ఉన్నాయి. నీ చైతన్యం యొక్క దృష్టియే నీకు ఇతర లోకానుభవాన్నిస్తుంది. ఈ స్థూల ప్రపంచంలోనే యావద్విశ్వం వుంది. సూక్ష్మ, మానసిక లోకాలలో అనేకానుభవాలు ఉన్నాయి. స్థూల లోకంలో కలిగే అనుభవాలకు సూక్ష్మ లోకానుభవాలకూ తేడా వుంటుంది. నీవు మాత్రం ఏమీ మారవు. నీ చైతన్యపు దృక్పథం మారుతుంది. దానినిబట్టి అనుభవాలు మారతాయి. చివరకు నీవు భగవంతునిగా అనుభూతిని పొందుతావు. అదే అసలైన అనుభవం. మిగిలిన స్థూల, సూక్ష్మ, మానసిక లోకానుభవాలన్నీ మాయ. అలాగే, స్వర్గం, నరకం, భూమికలు అన్నీను. అవన్నీ నీలోనే ఉన్నాయి. బయటెక్కడా లేవు. చివరకు నీవు నీ ఆత్మానుభవాన్ని పొందడానికి నన్ను ప్రేమించాలి. మరో మార్గం లేదు. కొందరు పిల్లల మానసిక ప్రవృత్తులు, చిత్ర విచిత్ర ప్రవర్తన తల్లిదండ్రులు సరిగా అర్థం చేసుకోవడం లేదు. గత జన్మలో ఐదవ చైతన్యానుభవానికి చేరిన ఆత్మలు, మరల జన్మించినప్పుడు సాధారణ బాలురవలె వుంటూ క్రమంగా గత జన్మపు చైతన్య స్థాయి యొక్క ఎరుకలోనికి ప్రవేశించడం అన్నది కష్టంతో కూడుకున్నది. అటువంటి స్థితిలో వారికి సద్గురు సహాయం అవసరమౌతుంది. వారిని బాహ్యమైన మందుల వల్లను, మానసిక వైద్యాల వల్లను బాధించరాదు. వారి మానసిక పరిస్థితిని సాధారణ మానవులు అర్థం చేసుకోలేరు. ❋

**సద్గురు కార్యసరళి– పే.295 లోని ఆసక్తికర అంశమిది...దయచేసి పరిశీలించండి !!**

# జ్యోతిషం

**నాకు** జ్యోతిషంలో ఆసక్తి ఎక్కువగా వుండేది. భారతీయ జ్యోతిష శాస్త్రానికి, అరేబియన్, అమెరికన్ జ్యోతిష శాస్త్రాలకీ వ్యత్యాసాలు తెలుసుకోవాలని నాకు అభిలాష. ఢిల్లీ సమీపంలో వుండే హెచ్.ఆర్. అనే ఆయన మంచి జ్యోతిష శాస్త్రజ్ఞుడని నాకు తెలిసింది. మనమంతా బాబా చేతులలో ఉన్నాం. ప్రతీదీ బాబా ఇచ్ఛానుసారమే జరుగుతుంది. మన జాతకాలు మన జీవితాన్ని మార్చలేవు అనీ, కర్మ సంస్కారాలు బాబాయే నియంత్రిస్తుంటారని నాకు తెలుసు. అయితే జ్యోతిష శాస్త్రంలో వుండే సాంకేతికతలు అంటే నాకు ఇష్టం. ఆయన దగ్గర భృగు సంహిత మూల గ్రంథ ప్రతులు ఉన్నాయి. ప్రస్తుతం కేవలం నాలుగు కాపీలే భారతదేశంలో ఉన్నాయని, మరొకటి బొంబాయిలో ఎవరి దగ్గరో వున్నదని నేను 1947లోనే తెలుసుకున్నాను. అయితే ఆ భృగు సంహిత ఒక పుస్తకం కాదని, విడివిడి పత్రాలని గ్రహించాను. ఆయన దగ్గర పెద్దపెట్టెలో విడివిడి పత్రాలు వెలికితీసాడు. ఆయన దగ్గరవున్న పత్రాలన్నీ బాగా నలిగిపోయి మసి పట్టి వున్నాయి. ఆయన జాగ్రత్తగా పరిశీలించి, నా కుమార్తె చార్మియాన్ యొక్క జాతకం ఆమె పుట్టిన సంవత్సరం నుండి ఎనభైవ ఏడు వరకు వరుసగా చెప్పాడు. ఆ తర్వాత, ఈ విషయాలన్నీ మెహెర్‌బాబా సోదరి మణికి, మెహెరాజాద్‌కు ఉత్తరం ద్వారా తెలియజేసాను. ఆ దరిమిలా బాబా సోదరి మణి మాకు జవాబు రాసింది. ఆ లేఖలో ఆమె ఇలా అన్నది. మీరు జ్యోతిష్కుని కలవడం బాబాకి నచ్చలేదు. బాబాకి అత్యంత సన్నిహితురాలుగా ఉంటూ, వారి రక్షణలో వున్న మీరు జ్యోతిష శాస్త్రాన్ని అనుసరించడం సరికాదు. ఆయన సంరక్షణలో వున్న మన యొక్క కర్మలను పూర్తిగా తొలగించకపోయినా, కర్మానుభవాల్ని త్వరితగతిని అనుభవింపజేసి తొలగింపజేస్తారు. మనం కాలబద్ధులం. ఆయన కాలాతీతుడు. ఎన్నో జన్మల కర్మ బంధాలు ఆయనకు తెలుసును. అందుచేత సద్గురువుకి అర్పించబడిన మీరు సాధారణ మానవులవలె మంత్ర తంత్రాలని ఆశ్రయించ కూడదు. అత్యంత అరుదైన బాబా సహవాస, సాన్నిధ్యాలు లభించిన మనం, కాలగతినే మార్చగలిగిన అవతారునికి అర్పించబడినప్పుడు మన కర్మబంధాలను ఆయనయే సరిచేస్తాడు. మంత్ర తంత్రాలతో మనకు పనిలేదు. నీకు జ్యోతిష శాస్త్రం అంటే ఆసక్తి వుండవచ్చు. కాని దానిలో కొట్టుకు పోరాదు. “బాబా మౌనం విరమించినప్పుడు మీ సందేహాలన్నీ పటాపంచలు అవుతాయని బాబా తెలియజేస్తున్నారు” అని ఆమె లేఖ రాసింది. బాబాను అవతార పురుషునిగా విశ్వసించి, ఆశ్రయించినప్పుడు మనం దేనికీ వ్యాకులపాటు చెందనవసరం లేదు. మేధోపరమైన విశ్వాసం కంటే, ఆత్మపరమైన ధృఢ విశ్వాసం కావాలి. బాబావారి సహవాసం మనకు అట్టి ధృఢ విశ్వాసం కలిగించిందనుకుంటాను, అని మణిజా రాసింది. *

## జీవిత సభ్యత్వం పొందినవారి వివరములు

**2002 –** ఫిబ్రవరి 2016 వరకు, మహారాష్ట్ర

| | | | |
|---|---|---|---|
| 1 | Satyavathi Y. | Feb, 04 | 1000 |
| 2 | Erra Sunil | May, 06 | 1000 |
| 3 | Sharma A.V.S | Jun, 06 | 1000 |
| 4 | Dr. Haresh G | Jun, 06 | 1000 |
| 5 | K.S. Ravi Kumar , Navi Mumbai | Feb.08 | 1000 |
| 6 | U.Meher Kumar, Navi Mumbai | Feb.08 | 1000 |
| 7 | V.Karunakararao,C/o NRao, Mum Pre atHyd | March. 08 | 1000 |
| 8 | G.S.J.B. Babaji, Pune | Sep, 09 | 1000 |
| 9 | Secretary, Andhra Rest House, Meherabad | Sep, 09 | 1000 |
| 10 | C.S. Sastry & Co. , Aurangabad | Nov, 12 | 1000 |
| 11 | C.R. Prasada Rao, Mumbai | July, 14 | 1000 |

## జీవిత సభ్యత్వం కొరకు ఒక దఫా మాత్రమే చెల్లించినవారి వివరములు

**2002 –** ఫిబ్రవరి 2016 వరకు, మహారాష్ట్ర

| | | | |
|---|---|---|---|
| 1 | Radha Krishna Charji, | Oct, 03 | 500 |
| 2 | Sankaraiah B Chandrapur | July, 04 | 500 |

## జీవిత సభ్యత్వం పొందినవారి వివరములు

**2002 –** ఫిబ్రవరి 2016 వరకు, మహబూబ్‌నగర్

| | | | |
|---|---|---|---|
| 1 | Narasimha Reddy | Feb - 14 | 1040 |

## జీవిత సభ్యత్వం పొందినవారి వివరములు

**2002 –** ఫిబ్రవరి 2016 వరకు, మెదక్

| | | | |
|---|---|---|---|
| 1 | JoshiNarayana Rao | Aug, 07 | 1000 |
| 2 | M. Shakarappa, Sangareddy | Oct, 10 | 1000 |
| 3 | Rajesham Ch. Siddipet | July, 02 | 1000 |
| 4 | K. Rama Chandar, Ramayampet | Aug - 13 | 1000 |
| 5 | G. Sujana, Ramachandrapuram | Mar - 14 | 1000 |
| 6 | Sinde Anjaneyulu, Bonguluru | Feb - 16 | 1000 |

## జీవిత సభ్యత్వం రెండు దఫాలుగా చెల్లించినవారి వివరములు

**2002 –** ఫిబ్రవరి 2016 వరకు, మెదక్

| | | | |
|---|---|---|---|
| 7 | G. Vittal, Siddipet | Feb. 11 | 500 |
| | G. Vittal, Siddipet | Feb, 12 | 500 |
| 8 | Veeraiah N. Chegunta | Aug, 02 | 500 |
| | Veeraiah N, Chegunta | Jan, 03 | 500 |
| 9 | E. Ravinder , RAMAYAMPET, | Feb, 10 | 500 |
| | E. Ravendar, Ramayampet | Mar, 13 | 500 |

## జీవిత సభ్యత్వం కొరకు ఒక దఫా మాత్రమే చెల్లించినవారి వివరములు

**2002 –** ఫిబ్రవరి 2016 వరకు, మెదక్

| | | | |
|---|---|---|---|
| 1 | Ch. Sambasiva Rao | Mar, 10 | 500 |
| 2 | Anjaneyulu. R, Sangareddy | Jan, 05 | 500 |
| 3 | G.Omprakash | Oct, 06 | 300 |
| 4 | Omprakash | July, 07 | 200 |
| 5 | Bhanu Prakash Sarma, Sangareddy | Feb.08 | 600 |
| 6 | I. Rama Goud, Ramayampet | Sep, 09 | 500 |
| 7 | C.H.V. Das, Ramayanapeta | Mar, 10 | 500 |
| 8 | P.Sridhar Rao, Siddipet | Oct, 10 | 500 |
| 9 | N. Laxmi Srinivasa Rao | Aug - 13 | 500 |
| 10 | C. Sambasiva Rao, Sangareddy | June - 15 | 500 |

## జీవిత సభ్యత్వం పొందినవారి వివరములు

**2002 –** ఫిబ్రవరి 2016 వరకు, నల్గొండ

| | | | |
|---|---|---|---|
| 1 | Venktappaiah.R. | Oct, 05 | 1000 |
| 2 | M. Bala Krishna | Mar, 07 | 1000 |
| 3 | B. Venkateswara Reddy, Kodada | May, 07 | 1000 |
| 4 | A. Sudhakar | Sept, 07 | 1000 |
| 5 | Karnati Venkata Reddy Miryalaguda | April. 08 | 1000 |
| 6 | Gopagani Teeshan, Miryalaguda | Mar, 09 | 1000 |
| 7 | Kolishetti Sambasiva Rao, | Jan. 10 | 1000 |
| 8 | Miryala Rajendar Kumar | July, 10 | 1000 |
| 9 | V. Saidaiah, Vadepalli | July, 10 | 1000 |
| 10 | K.KRISHNA, MOTHUKURU | Feb, 10 | 1000 |
| 11 | Bavuji Shaka Grandalayam, Kodada | April - 14 | 1000 |
| 12 | G. Meher Baba, Ramagiri | Feb - 16 | 1000 |

## జీవిత సభ్యత్వం రెండు దఫాలుగా చెల్లించినవారి వివరములు

**2002 –** ఫిబ్రవరి 2016 వరకు, నల్గొండ

| | | | |
|---|---|---|---|
| 13 | Dama Srinivasarao, Miryalaguda | July, 11 | 500 |
| | D. Srinivasa Rao | Aug - 13 | 500 |

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.
మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,
త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

# జీవిత సభ్యత్వం

**2016 ఏప్రిల్ నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | ఏప్రిల్,16 | యం. రాజారావ్, గోదావరిఖని, కరీంనగర్ | రూ.500.00 |
| 2. | ఏప్రిల్,16 | సి. ఎఱు స్వామి, ధర్మవరం, అనంతపూర్ | రూ.1000.00 |
| 3. | ఏప్రిల్,16 | ఎన్. హనుమంతరెడ్డి, మెదక్ జిల్లా | రూ.1000.00 |
| 4. | ఏప్రిల్,16 | ఎన్. లక్ష్మి శ్రీనివాస్, రామచంద్రాపురం, మెదక్ | రూ.1000.00 |
| 5. | ఏప్రిల్,16 | ఎస్. జలేందర్, జగిత్యాల, కరీంనగర్ | రూ.1000.00 |
| 6. | ఏప్రిల్,16 | జొన్నం రాజయ్య, ఉదంపూర్, అదిలాబాద్ | రూ.1000.00 |
| | | మొత్తం | **రూ. 5500.00** |

## జీవిత సభ్యత్వం

మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/- ఆన్‌లైన్‌లో పంపగోరువారు శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 100/- ఆన్‌లైన్‌లో పంపగోరువారు శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.

**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**

వార్షిక సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్, ద్వారా పంపువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

## మా అడ్రస్:

ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ పోస్టు, సికింద్రాబాద్-500087.

ఫోన్: 99595-53218. **email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D. Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2014-2016, **Dt.06-01-2014,** Date of Publication 17th of every month, Posted at Patrika Channel on 19 / 20th every month.